


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 30 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 76 పేజీలు : 4 వెల : రూ 3-00

# వడ్డీతో సహా చెల్లిస్తాం: చంద్రబాబు



చిత్తూరు: టీడీపీ మళ్లీ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజక వర్గమైన కుప్ప నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొందరు అధికారులు, పోలీసులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. ప్రజల కోసం పనిచేసే పార్టీ టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని తాము ప్రశ్నిస్తూనే ఉంటామని చంద్రబాబు తెలిపారు. అక్రమ కేసులకు టీడీపీ నేతలు భయపడరన్నారు. కుప్పం నియోజకవర్గంలోకి రౌడీలు, గూండాలు ప్రవేశించారని ఆయన అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అరాచకాలు సృష్టిస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలపై మేధావులు స్పందించాలన్నారు. వైసీపీది ప్రజా ప్రభుత్వం కాదు.. దోపిడీ ప్రభుత్వమని ఆయన ధ్వజమెత్తారు. వైసీపీ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ఎయిడెడ్ పాఠశాలల మూసివేత దుర్మార్గమని చంద్రబాబు అన్నారు. పాఠశాలల ఆస్తులను కాజేసేందుకే ఈ ప్రయత్నమని ఆయన ఆరోపించారు. పేద విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజావ్యతిరేకత మొదలైందన్నారు. మేం పులివెందులకు నీళ్లిస్తే.. మీరు కుప్పంకు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. నియంతలు కాలగర్భంలో కలిసిపోయారని చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పం ప్రజలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని చంద్రబాబు హెచ్చరించారు. ఎన్ని ఇబ్బందులు సృష్టించినా వెనుకడుగు వేయనని చంద్రబాబు స్పష్టం చేసారు.

# ప్రతి గ్రామానికి ఇంటర్ నెట్, డిజిటల్ లైబ్రరీలపై సీఎం జగన్ సమీక్ష




తాడేపల్లి: ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రరీకి అంతరాయం లేని బ్యాండ్ విడ్త్‌తో ఇంటర్నెట్‌ను ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాని సీఎం అధికారులకు సూచించారు. ప్రతి గ్రామానికి ఇంటర్ నెట్, డిజిటల్ లైబ్రరీలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం చేపట్టారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నంతో పాటు తూర్పుగోదావరి జిల్లాలలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణంపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నాలుగు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, వర్క్ ఫ్రం హోం కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామాల నుంచే పనిచేసే పరిస్థితి రావాలని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ లైబ్రరీల నిర్మాణాల ప్రగతిపై సీఎం జగన్‌కు అధికారులు వివరాలు అందించారు. రాష్ట్రంలో 12,979 పంచాయతీల్లో వైఎస్ఆర్ విలేజ్ డిజిటల్ లైబ్రరీలు నిర్మాణం చేపడుతున్నామని, మూడు దశల్లో విలేజ్ డిజిటల్ లైబ్రరీల నిర్మాణం చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు. తొలి విడతలో చేపడుతున్న 4530 విలేజ్ డిజిటల్ లైబ్రరీల నిర్మాణ పనుల ప్రగతిపై సీఎంకు వివరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతకు ఉపయోగపడాలని, విలేజ్ డిజిటల్ లైబ్రరీలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వీటి నిర్వాహణపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. జనవరి నాటికి తొలిదశలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు తెలియజేయగా.. అదే సమయంలో కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించాలని సీఎం అన్నారు. ప్రతి డిజిటల్ లైబ్రరీలో డెస్క్‌టాప్ కంప్యూటర్లు, సిస్టం ఛైర్లు, ప్లాస్టిక్ ఛైర్లు, ఫ్యాన్లు, ట్యూబులైట్లు, ఐరన్ రాక్స్, పుస్తకాలు, మేగజైన్‌ల ఏర్పాటు తప్పనిసరి అని తెలిపారు. ఉగాది నాటికి ఫేజ్1లో కంప్యూటర్ పరికరాలతో సహా అందుబాటులోకి మొదటి దశ డిజిటల్ లైబ్రరీలు డిసెంబరు 2022 నాటికి ఫేజ్2 పూర్తి చేసేలా కార్యాచరణ చేయాలన్నారు. జూన్ 2023 నాటికి మూడో దశ డిజిటల్ లైబ్రరీల నిర్మాణ లక్ష్యంగా నిరేశించుకోవాలని, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో అన్‌ఇంటరెప్టడ్ బ్యాండ్‌విడ్త్‌తో కూడిన ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశానికి పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, ఇంధనశాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కోన శశిధర్, ఏపీఎస్‌ఎఫ్ఎల్ ఎండీ ఎం మధుసూధన్ రెడ్డి, ఏపీటీఎస్ ఎండీ ఎం నందకిషోర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అమరావతి రైతుల పాదయాత్రకు హైకోర్టు అనుమతి

అమరావతి: అమరావతి రైతుల పాదయాత్రకు ఏపీ హైకోర్టు అనుమతిచ్చింది. పాదయాత్ర అనుమతి కోసం లంచ్ మోషన్ పిటిషన్‌పై కోర్టు విచారించింది. పాదయాత్రకు అనుమతి ఇవ్వకూడదని ప్రభుత్వ న్యాయవాది అభ్యంతరం తెలిపారు. పోలీసులు అనుమతి నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో సహేతుకమైన కారణాలు లేవని న్యాయవాది లక్ష్మీనారాయణ వాదించారు. పాదయాత్రకు అనుమతిస్తే అభ్యంతరం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. రైతుల పాదయాత్రపై గ్రామాల్లో రాళ్లు వేసే ప్రమాదం ఉందని, శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. రైతులు శాంతియుతంగా పాదయాత్ర చేస్తారని పిటిషనర్ల తరపు న్యాయవాది లక్ష్మీనారాయణ తెలిపారు. రైతుల పాదయాత్రకు షరతులతో న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. 'న్యాయస్థానం నుంచి దేవస్థానం' పేరిట అమరావతి నుంచి తిరుమల వరకు మహాపాదయాత్రకు అమరావతి రైతులు, మహిళలు, కూలీలు సిద్ధమవుతున్నారు. నవంబరు 1 నుంచి డిసెంబరు 17 వరకు 45 రోజుల పాటు పాదయాత్ర చేపట్టనున్నట్లు అమరావతి జేఏసీ, రైతు సంఘాల నేతలు ప్రకటించారు.




# ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ మరో 3 ఏండ్లు!




భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పట్ల కేంద్ర ప్రభుత్వం విశ్వాసం ప్రకటించింది. మరో మూడేండ్ల పాటు ఆయన ఆ పదవీకాలం పొడిగింపునిచ్చారు. అంటే 2024 డిసెంబర్ వరకు ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ కొనసాగుతారు. 1980వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్.. 2018 డిసెంబర్ 12న ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ తన పదవీ కాలానికి ముందే రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కేంద్రం శక్తికాంత దాస్‌ను నియమించింది. ఈ ఏడాది డిసెంబర్ 10తో ఆయన పదవీ కాలం ముగియనున్నది. గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రధాని మోదీ సారథ్యంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ శక్తికాంత దాస్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నది. కరోనా మహమ్మారి వేళ వివిధ పరిశ్రమలు మూతపడి.. ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతినడంతో వ్యవస్థలో ద్రవ్య లభ్యత సంక్షోభం ముందుకొచ్చింది. ఈ సమస్య పరిష్కారానికి ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ రంగంలోకి దిగారు. ద్రవ్యపరపతి విధానంలో వడ్డీరేట్లు తగ్గించారు. ప్రస్తుతం వివిధ రుణాలపై వడ్డీరేట్లు 6.44 శాతం నుంచి ప్రారంభం అవుతుండగా, డిపాజిట్లపై 5 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. దీంతో దేశీయంగా ఇండ్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఉద్దీపన ప్యాకేజీలతో పాటు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పూనుకున్నారు. ప్రత్యేకించి ఆరు నెలల పాటు రుణ బకాయిల వసూళ్లపై మారటోరియం విధించడంతో సత్ఫలితాలొచ్చాయి. కష్టాల్లో చిక్కుకున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలిచ్చారు. మరోవైపు కేంద్రంతో సమన్వయం చేసుకున్నారు. కరోనా రెండో వేవ్ తర్వాత ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతున్నది. ఈ తరుణంలో ఎకానమీకి మరింత బూస్ట్‌నిచ్చేందుకు శక్తికాంత దాస్ వ్యూహాలు అవసరం అని కేంద్రం భావించినట్లు తెలుస్తున్నది. 1980వ బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శక్తికాంత దాస్.. 2017 వరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శిగా పని చేశారు. 2016లో నోట్ల రద్దు టైంలో కేంద్రంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆర్థికశాఖలో పని చేస్తున్నప్పుడు 8 బడ్జెట్ల రూపకల్పనలో భాగస్వామి అయ్యారు. ఆర్థికం, పన్నులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 38 ఏండ్ల కెరీర్‌లో శక్తికాంత దాస్ వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.

# పునీత్ రాజ్‌కుమార్ మృతి.. సంతాపం తెలిపిన సీఎం జగన్



అమరావతి: కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మరణవార్త సినీ పరిశ్రమలో తీవ్ర విషాదాన్ని నింపింది. పునీత్ మృతిపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పునీత్ మృతిపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్య రోజా సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త విని తీవ్రగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను అంటూ ట్వీట్ చేశారు.

# 'రైతు సంక్షేమం కోసం సీఎం జగన్ ఎన్నో పథకాలు తెచ్చారు'

అమరావతి: రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ఇచ్చని హామిని నిలబెట్టుకుని సాయం అందిస్తోందని చెప్పారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలకు అండగా ఉన్నామని, అర్హులైన వారి కుటుంబాలను ఆదుకుంటున్నామని తెలిపారు. అయితే కొందరు మాత్రం అదే పనిగా ప్రభుత్వంపై అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారని, అలాంటివి మానుకోవాలని హితవు పలికారు.



# ఏఐటీటీ ర్యాంక్ హోల్డర్స్‌కు సీఎం జగన్ అభినందనలు




అమరావతి: ఏఐటీటీ 2020 (సీటీఎస్)లో ఆల్ ఇండియా టాప్ ర్యాంక్స్ సాధించిన ఏపీకి చెందిన 5 గురు విద్యార్థులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఒక్కోక్క విద్యార్థికి రూ. 5 లక్షల నగదు ప్రోత్సాహకం ఇస్తున్నట్లు ప్రకటించారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులు

డి.మణికంఠ, మెకానిక్ డీజిల్ ట్రేడ్‌లో ఆల్ ఇండియా సెకండ్ ర్యాంక్

వెుంండి సతీష్, ఎలక్ట్రీషియన్, ఆల్ ఇండియా ఐదో ర్యాంక్

ఎన్.కుమారి, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఆల్ ఇండియా ఆరో ర్యాంక్

ఎం.బాల పవన్ రాజు, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఆల్ ఇండియా ఎనిమిదో ర్యాంక్

ఎం.రోషణ్, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ, ఆల్ ఇండియా తొమ్మిదో ర్యాంక్

విద్యార్థులతో పాటు కౌశలాచార్య అవార్డు 2021ని సాధించిన డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ వై.రజిత ప్రియను కూడా సీఎం జగన్ అభినందించారు. ఆమెకు కూడా రూ. 5 లక్షల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. విద్యార్థులకు మెమెంటోలతో పాటు సర్టిఫికెట్‌లు, ట్యాబ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి, రీజనల్ డైరెక్టర్ ఏ.వెంకటేశ్వర రావు, జాయింట్ డైరెక్టర్ జి.బాలసుబ్రహ్మణ్యం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్‌కు రోజూ రాజకీయాలు కావాలి: పేర్ని నాని

అమరావతి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ట్వీట్‌పై ఏపీ మంత్రి పేర్నినాని స్పందించారు. టీఆర్ఎస్ పార్టీ అయినా, ఇంకో పార్టీ అయినా డైరెక్ట్‌గా మాట్లాడాలని నాని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి రోజూ రాజకీయాలు కావాలని, రోజూ రాజకీయాల్లో ఉండాలనేకునేవారు ఇలాగే మాట్లాడతారని పేర్ని నాని వ్యాఖ్యానించారు. తాను కేవలం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన మాటలపైనే మాట్లాడానని తెలిపిన నాని.. తెలంగాణలో రాజకీయ శూన్యత ఉంది కాబట్టే కొత్త పార్టీలు వస్తున్నాయన్నారు. తెలంగాణలో తీర్మానం చేస్తే రెండు రాష్ట్రాలు కలిసిపోతాయని, కొత్త పార్టీ ఎందుకని పేర్ని నాని ప్రశ్నించారు. ఏపీలో పార్టీ పెడతానన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కామెంట్లపై మంత్రి పేర్ని నాని గురువారం స్పందించిన సంగతి తెలిసిందే. రెండు రాష్ట్రాల్లో పార్టీ ఎందుకు.. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపేస్తే పోలా అని చమత్కరించారు. కేసీఆర్ పార్టీ పెట్టాలని మేము కూడా కోరుకుంటున్నాం అన్నారు పేర్ని నాని.



# సంపాదకీయం

శనివారం 30 అక్టోబరు 2021

## వేల కోట్ల కు చేరుకున్న క్రిప్టో కరెన్సీ

దేశంలో క్రిప్టో ఇండస్ట్రీ వేగంగా విస్తరిస్తోంది. గ్లోబల్‌గా చూస్తే ఇండియాలోనే ఎక్కువ మంది క్రిప్టో ఇన్వెస్టర్లు ఉన్నారని అంచనా. దేశంలో 10 కోట్ల మంది క్రిప్టో ఓనర్లు ఉన్నారని బ్రోకర్ చూజర్ ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో దేశంలో క్రిప్టో ఇన్వెస్ట్‌మెంట్ల విలువ 6.6 బిలియన్ డాలర్ల ( రూ. 49,189 కోట్ల) కు చేరుకుంది. కిందటేడాది సెప్టెంబర్‌లో కేవలం 923 మిలియన్ డాలర్ల (రూ. 6,830 కోట్ల) ఇన్వెస్ట్‌మెంట్లు మాత్రమే జరిగేవి. స్టాక్ మార్కెట్ల కంటే క్రిప్టో ఇండస్ట్రీపై ఆసక్తి ఎక్కువయ్యింది. చాలా మందికి షేర్లు, బాండ్లు తెలియక పోయినా, బిట్‌కాయిన్ గురించి తెలుస్తోంది. అతిపెద్ద స్టాక్ బ్రోకరేజ్ కంపెనీ జెరోధా కస్టమర్ల కంటే క్రిప్టో ఎక్స్ఛేంజి కాయిన్ స్విచ్ కుబేర్ కస్టమర్లు ఎక్కువగా ఉండడం విశేషం. దేశంలో మొత్తం 15 క్రిప్టో ఎక్స్ఛేంజిలు గత రెండేళ్లలోనే పుట్టుకొచ్చాయి. ఇంతలా క్రిప్టో ఇండస్ట్రీపై ఆసక్తి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. క్రిప్టో ఇండస్ట్రీ భారీగా విస్తరించడానికి ప్రధాన కారణం యువతే. 18?40 ఏళ్ల మధ్య వయసున్న వారు క్రిప్టో ట్రేడింగ్‌కు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. తక్కువ టైమ్‌లోనే పెద్ద మొత్తంలో రిటర్న్‌లు వస్తుండడం క్రిప్టో ట్రేడింగ్‌లో మెయిన్ అడ్వాంటేజ్. నష్టాలు కూడా అలానే వస్తాయి. కానీ, నష్టపోతే మన పెట్టిన డబ్బులు పోతాయి. అదే ప్రాఫిట్స్ వస్తే పెట్టిన ఇన్వెస్ట్‌మెంట్ డబుల్, ట్రిపుల్ అవుతుందని అంచనా వేస్తున్నారు. కొన్ని క్రిప్టో కరెన్సీలు 1000 శాతానికి పైగా లాభాలను తక్కువ టైమ్‌లోనే ఇచ్చాయి. ఇది ఇన్వెస్టర్లను ముఖ్యంగా యువతను ఆకర్షిస్తోంది. బిట్‌కాయిన్, డోజ్‌కాయిన్, ఎథరమ్ వంటి ఫేమస్ కరెన్సీలతో పాటే రీసెంట్‌గా పాపులర్ అవుతున్న సొలానా, కార్డనో వంటి కరెన్సీలు కూడా గత కొన్ని సెషన్ల నుంచి భారీగా ర్యాలీ చేస్తున్నాయి. టీనేజర్లు తమ పేరెంట్స్ డిటైల్స్‌తో అకౌంట్లు ఓపెన్ చేసి క్రిప్టో ట్రేడింగ్ చేస్తున్నారు. క్రిప్టో ట్రేడింగ్ 24 గంటలూ ఉంటుంది. గ్లోబల్‌గా అన్ని దేశాల్లోని ఇన్వెస్టర్లు ఈ ట్రేడింగ్‌లో పాల్గొంటారు. దీంతో లిక్విడిటీ ఎక్కువగా ఉంటుంది. ఇది యువతను ఆకర్షిస్తోంది. రిస్క్ తీసుకోవడానికి బయపడని ఇన్వెస్టర్లు క్రిప్టోలో డబ్బులు పెడుతున్నారు. కొంతమంది భారీ లాభాలను చూడగా, మరికొంత మంది నష్టపోతున్నారు కూడా. అయినప్పటికీ క్రిప్టోలపై రోజు రోజుకీ ఆసక్తి పెరుగుతూనే ఉంది. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వంటి కొత్త ఇన్నొవేషన్లలో స్టార్టింగ్ స్టేజ్‌లోనే ఇన్వెస్ట్ చేయాలనే ఆలోచన పెరిగింది. ఇక ఫ్యూచర్‌లో వర్చువల్ కరెన్సీలే ఉంటాయనే అంచనాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా క్రిప్టోలను ఆదరిస్తుండడంతో ఈ ఇండస్ట్రీ సస్టయిన్ అవుతుందనే నమ్మకం ఇన్వెస్టర్లకు కలుగుతోంది. సర్కులర్ను మార్చిన ఆర్బీఐ. ఈ ఏడాది మే నెలలో ఆర్‌బీఐ ఇచ్చిన సర్కులర్ క్రిప్టో ఇండస్ట్రీకి వరంలా మారింది. క్రిప్టో ట్రేడింగ్‌కు వ్యతిరేకంగా 2018 లో ఇచ్చిన ఆదేశాలను పాటించొద్దని ఈ ఏడాది మేలో ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించింది. క్రిప్టో సెటిల్‌మెంట్స్‌ను అడ్డుకోవద్దని ప్రకటించింది. ఇది క్రిప్టో ఇండస్ట్రీకి పాజిటివ్ అంశం. ఆర్‌బీఐ ఇచ్చిన 2018 ఆదేశాలను 2020 లో సుప్రీం కోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి దేశంలో క్రిప్టో ఇండస్ట్రీ రోజు రోజుకి పెరుగుతూనే ఉంది. క్రిప్టో ఎక్స్ఛేంజిల్లో ట్రేడింగ్ వాల్యూమ్స్ పెరుగుతున్నాయి. ప్రభుత్వానికి క్రిప్టోలను బ్యాన్ చేసే ఆలోచన లేదని, ఈ ఇండస్ట్రీపై రెగ్యులేషన్స్ పెట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. ప్రస్తుతం క్రిప్టో ట్రేడింగ్ లాభాల్లో 30 శాతం క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌ను విధిస్తున్నారు. కాగా, ప్రభుత్వం కూడా డిజిటల్ కరెన్సీ బిల్లును తీసుకు రావాలని చూస్తోంది. డిజిటల్ రూపాయిని తెచ్చేందుకు సిద్ధమవుతుండడంతో ప్రభుత్వానికి వర్చువల్ కరెన్సీలను బ్యాన్ చేసే ఆలోచన లేదనే ఊహాగానాలు ఎక్కువవుతున్నాయి. దేశంలో క్రిప్టో మేనియాకు ఇదొక కారణం. క్రిప్టోల వైపు మరింత మందిని ఆకర్షించడానికి వజీర్‌ఎక్స్, కాయిన్‌స్విచ్ కుబేర్ వంటి ఎక్స్ఛేంజిలు బాలివుడ్ యాక్టర్లతో క్యాంపెయిన్ చేస్తున్నాయి. తమ ఫేవరేట్ యాక్టర్ క్రిప్టోల్లో ఇన్వెస్ట్ చేయమని చెబితే ఇన్వెస్టర్లకు కూడా క్రిప్టోలపై నమ్మకం కలుగుతుందని ఈ ఎక్స్ఛేంజిలు భావిస్తున్నాయి. అమితాబచ్చన్ వంటి సూపర్ స్టార్లు తమ సొంత నాన్ ఫంగిబుల్ టోకెన్ (ఎన్‌ఎఫ్‌టీ)లను విడుదల చేస్తుండడంతో క్రిప్టో క్రేజ్ మరింత పెరుగుతోంది. దేశియ కాయిన్లయిన బోలీకాయిన్, విగారిలను బాలీవుడ్ యాక్టర్ సల్మాన్‌ఖాన్ ప్రమోట్ చేస్తున్న విషయం తెలిసిందే. దేశంలో క్రిప్టో మేనియా స్టార్టయ్యింది. ఒకప్పుడు వర్చువల్ కరెన్సీలను చూసి బయపడిన వారే, ఇప్పుడు ఈ కరెన్సీల వైపు పరుగెడుతున్నారు. ముఖ్యంగా యువత రిస్క్ ఉన్నా తాము రెడీగా ఉన్నామంటోంది. దేశంలో క్రిప్టో ఓనర్లు 10 కోట్లకు పైనే ఉన్నారు. ఇది స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల కంటే ఎక్కువ. తక్కువ టైములోనే భారీ లాభాలు వస్తుండడంతో పాటు, బ్లాక్ చెయిన్ టెక్నాలజీదే ఫ్యూచర్ అనే ఆలోచన ఇన్వెస్టర్లలో నెలకొంది. క్రిప్టో ఇండస్ట్రీ మరింత పెరుగుతుందనే అంచనాలు మరింతగా బలపడుతున్నాయి. తాజాగా 67 వేల డాలర్లను టచ్ చేసిన బిట్‌కాయిన్, భవిష్యత్‌లో లక్ష డాలర్లను టచ్ చేసిన ఆశ్చర్య పోవాల్సిన పనిలేదంటున్నారు కొంత మంది ఎనలిస్టులు. ఈ ఏడాది చివరికల్లా లక్ష డాలర్ల మార్క్‌ను ఈ క్రిప్టో కరెన్సీ టచ్ చేస్తుందని చెబుతున్నారు. యూఎస్‌లో బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌ను లాంచ్ చేశారు. దీంతో ఈ క్రిప్టోపై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతోంది. ముఖ్యంగా చిన్న ఇన్వెస్టర్ల కంటే పెద్ద పెద్ద ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు బిట్‌కాయిన్‌పై ఎక్కువ పాజిటివ్‌గా ఉన్నారు. మరికొంత మంది ఎనలిస్టులు మాత్రం ఈ ఏడాది చివరికల్లా బిట్‌కాయిన్ 90 వేల డాలర్లను టచ్ చేస్తుందని చెబుతున్నారు.

# కొత్త వారికే అవకాశం

### ఏపీలో బెంగాల్ ఫార్ములా

విజయవాడ, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి విజయం సాధించాలనుకుంటున్నారు. పార్టీని రెండోసారి అధికారంలోకి తేవాలనుకుంటున్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు 151 సీట్లు ఇచ్చారు. అయితే గత రెండున్నరేళ్ల కాలంలో స్థానిక ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది. జగన్ ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు. ప్రభుత్వంపైన, జగన్ పైన కంటే స్థానికంగా ఎమ్మెల్యేలపైనే వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఇటీవల ఇండో ఆసియన్ న్యూస్ సర్వీస్, సీ ఓటరు సర్వే కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. దేశంలో కెల్లా ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత ఉన్న రాష్ట్రంగా ఏపీ సర్వేలో వెల్లడయింది. 28.5 శాతం మంది ప్రజలు ఎమ్మెల్యేలపై వ్యతిరేకంగా ఉన్నారు. ఎమ్మెల్యేలపై ఉన్న అసంతృప్తి ప్రభుత్వంపైన పడనుంది. వచ్చే ఎన్నికల్లోనూ ప్రభావం చూపనుంది. జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ప్రజలకు నేరుగా నిధులను డంప్ చేస్తున్నా ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతకు కారణాలపై వైసీపీ అధ్యయనం చేస్తుంది. ఇందుకు ప్రధాన కారణాలు వైసీపీ ఎమ్మెల్యేలు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండకపోవడమే. అభివృద్ధి పనులకు నిధులను ప్రభుత్వం కేటాయించకపోవడం, ప్రతి పనీ వాలంటీర్ల ద్వారా ప్రభుత్వం చేస్తుండటంతో ఎమ్మెల్యేలు తమకు చేతిలో పనిలేదని భావిస్తున్నారు. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు తమ సొంత వ్యాపారాలపై దృష్టి పెట్టారు. పొరుగు రాష్ట్రాలైన హైదరాబాద్, బెంగళూరులోనే ఎక్కువ సమయాన్ని గడుపుతున్నారు. పార్టీ కార్యక్రమాలకు హాజరవ్వడం తప్పించి వారు ప్రజలకు అందుబాటులో లేకపోవడవే ఈ అసంతృప్తికి కారణాలుగా చూస్తున్నారు. దీంతో జగన్ పశ్చిమ బెంగాల్ ఫార్ములాను వచ్చే ఎన్నికల్లో అమలు చేయాలని నిర్ణయించారు. అక్కడ మమత బెనర్జీ వరసగా మూడో సారి అధికారంలోకి వచ్చారు. పరిస్థి?తిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి మమత ఎక్కువ స్థానాల్లో కొత్త అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చారు. అందువల్లనే మమతకు మళ్లీ విజయం సాధ్యమయింది. మమత రూట్లోనే వెళ్లాలని జగన్ కూడా భావిస్తున్నారు. మమతకు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించిన ప్రశాంత్ కిషోర్ సయితం జగన్ కు ఇదే సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను తొలగించుకోవడానికి జగన్ పశ్చిమ బెంగాల్ ఫార్ములాను వచ్చే ఎన్నికల్లో అమలు చేయనున్నారు. అధికశాతం మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి టిక్కెట్లు దక్కడం కష్టమేనన్నది పార్టీలో విన్పిస్తున్న టాక్.

# క్లాసులు సరే... పుస్తకాలు ఎక్కడా

ఏలూరు, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్యాంశ పుస్తకాలు ఇంకా అందలేదు. కరోనా కారణంగా ఈ విద్యా సంవత్సరం పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 16 నుంచి తెరిచిన విషయం తెలిసిందే. తరగతులు ప్రారంభమై మూడు నెలలు కావొస్తున్నా ఇంతవరకు విద్యార్థులకు పుస్తకాలు అందకపోవడం గమనార్హం. ఈ విద్యా సంవత్సరం ప్రారంభించిన మొదటి రోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు, పుస్తకాలను విద్యాశాఖ అందించడం అభినందనీయమే. అయితే కొత్తగా చేరిన వారికి జగనన్న విద్యాకానుక కిట్ల (జెవికె)ను అందించడంలో మాత్రం విఫలమైంది. దీంతో కొత్త విద్యార్థులు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు లేకుండానే సాధారణ డ్రెస్సులతో బడికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత విద్యా సంవత్సరం పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్యకు అదనంగానే జెవికె కిట్లను ఈ విద్యా సంవత్సరం పాఠశాలలకు విద్యాశాఖ పంపింది. గత విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో 43,56,647 మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,97,291 మంది మొత్తంగా 45,53,938 మంది చదివారు. ఈ విద్యా సంవత్సరానికి రూ.731.30 కోట్లతో 47,32,164 కిట్లకు పాఠశాల విద్యాశాఖ ఆర్డర్లు ఇచ్చింది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు, కరోనా ప్రభావం వల్ల చిన్న ప్రైవేట్ పాఠశాలలు జరగకపోవడం వంటి కారణాలతో ఈ విద్యాసంవత్సరం పెద్దఎత్తున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. మొత్తంగా 15-20 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అదనంగా చేరారని అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్తగా చేరిన పిల్లల సంఖ్యను జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాల విద్యకు పంపినట్లు తెలిసింది. ఇంకా కొన్ని జిల్లాల నుంచి సమాచారం రావాల్సి ఉంది. మొత్తంగా సుమారు 6 లక్షల మంది విద్యార్థులకు కిట్లు అందలేదని అధికారులు అంచనా వేస్తున్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల ఆధార్ కార్డులు అప్‌డేట్ కాకపోవడంతో తిప్పలు పడుతున్నారు. ఐదేళ్లు దాటిన పిల్లలు ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. విద్యార్థుల తల్లిదండ్రులు అప్‌డేట్ చేయించుకున్న 20 రోజుల తరువాత అప్‌డేట్ అవుతుందని పోస్టల్ శాఖ వారు చెబుతున్నారని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ గడువు దాటినా చైల్డ్‌ఇన్‌ఫోల్ అప్‌డేట్

అయినట్లు రావడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇలా ఆధార్ అప్‌డేట్ కాని విద్యార్థుల సంఖ్య ప్రతి ప్రాథమిక పాఠశాలలో 15, ప్రతి ఉన్నత పాఠశాలలో 30 వరకు ఉంటాయి. చైల్డ్ ఇన్‌ఫోలో చేర్చేందుకు వీరి ఆధార్ కార్డులను ప్రతిరోజూ తనిఖీ చేస్తున్నారు. దీంతో బోధన పనులు పక్కకు వెళ్లి ఆధార్ పనులు పట్టుకున్నాయి. మరోపక్క ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సమాచారం కూడా ఉపాధ్యాయులకు రావడం లేదు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరిన తరువాత ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వారి పాఠశాలల్లో విద్యార్థి చదవడం లేదనే సమాచారాన్ని చైల్డ్‌ఇన్‌ఫోలో తొలగించాలి. అలా అయితేనే వేరే పాఠశాలల్లో అడ్మిషన్ ఇవ్వాలి. కానీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల సమాచారాన్ని వారి పాఠశాలల్లోంచి తొలగించడం లేదు. విద్యార్థులు మాత్రం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నారు.

# ఎందుకు చంపారబ్బా...

### వివేక హత్య కేసు.. అన్నీ అనుమానాలే

కడప, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మిస్టరీ వీడలేదు. హత్య జరిగి దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఆయన హత్యకు గల కారణాలు తెలియ రాలేదు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనేక అనుమానాలున్నాయి. వాటన్నింటికి సిబీఐ ఎలాంటి సమాధానాలు ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. సీబీఐ అధికారులు తూతూ మంత్రంగా విచారణ చేపట్టి నిందితులపై ఛార్జి షీటును దాఖలు చేశారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. 2019 మార్చి 15వ తేదీన వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగింది. అతి దారుణంగా కిరాతకులు ఆయనను హత్య చేశారు. ఒక మాజీ మంత్రి, మాజీ ముఖ్యమంత్రి సోదరుడు హత్య నాడు కలకలం రేపింది. హత్యకు రాజకీయ కారణాలు ఏవైనా ఉన్నాయా? అన్న రీతిలో దర్యాప్తు సాగింది. చివరకు చిన్న స్థాయి వ్యక్తులు గంగిరెడ్డి, దస్తగిరి, సునీల్ కుమార్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి ఛార్జిషీటు దాఖలు చేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలున్నాయి. నలుగురు పెద్దగా ఎలాంటి ప్రభావం చూపే వ్యక్తులు కాదు. వైఎస్ వివేకానందరెడ్డి వారిని హత్య చేసే ధైర్యం వీరికి ఉండదనే అనుకోవాలి. గజ్జల ఉమాశంకర్ రెడ్డి వివేకా వద్ద పీఏగా పనిచేసే జగదీశ్వర్ రెడ్డి సోదరుడు. పాలడెయిరీని నిర్వహిస్తుంటాడు. సునీల్ కుమార్ యాదవ్ కూడా సాధారణ వ్యక్తి. ఈయన ఉమాశంకర్ రెడ్డితో కలిసి హత్యకు ప్రణాళిక రచించారని సీబీఐ అధికారులు చెబుతున్నారు. ఒక్క గంగిరెడ్డి మాత్రమే వైఎస్ వివేకానందెరడ్డికి అత్యంత సన్నిహితుడు. నలభై ఏళ్ల అనుబంధం. ఈయన హత్య జరిగిన రోజు ఆధారాలన్నీ తుడిచివేశారు. డ్రైవర్ దస్తగిరి కూడా హత్యకు రెండేళ్లు ముందు వివేకా వద్ద పని చేసి మానేశారు. నలుగురిలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య చేసేంత కసి ఎందుకుంటుంది? అందుకు గల బలమైన కారణాలేంటి? అన్న సందేహాలు సహజంగానే వస్తాయి. ఈ కేసులో మొత్తం 60 మంది వరకూ విచారించిన సీబీఐ అధికారులు నిందితులు ఎవరో గుర్తించారు తప్పించి హత్యకు గల కారణాలను మాత్రం చెప్పలేకపోయారు. ఆస్తి వివాదాలు వీరిమధ్య ఉండే అవకాశాలు లేవు. ఆర్థిక లావాదేవీలేమైనా కారణమని అంటున్నా దానికి తగ్గ ఆధారాలు లేవు. దీంతో వైఎస్ వివేకా హత్య ఎందుకు జరిగిందన్న మిస్టరీ మాత్రం ఇంకా వీడకపోవడం విశేషం. దీనిపై వైఎస్ వివేకా కుటుంబ సభ్యులు కూడా అభ్యంతరం తెలుపుతున్నారు.

# కడపలో స్టీల్ ప్లాంట్ కు అనుమతులు

కడప, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)డప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు వచ్చాయి. కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం అనుమతుల మేరకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. 3591 ఎకరాల్లో కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం అవుతుంది. ఏడాదికి మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటవుతుంది. దీని కోసం రూ. 16,986 కోట్ల పెట్టుబడులు అవసరమని అంచనా. ఏపీలోని కడప స్టీల్ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులను ఈ ఏడాది మార్చి నెలలోనే మంజూరు చేసింది కేంద్రం. దీనిపై డిసెంబర్ 20న కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది ఏపీ సర్కార్. దీంతో మార్చి 9న అనుమతులు మంజూరు చేసింది. కడప స్టీల్ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులు లభించడంతో దేశంలోనే అత్యంత తక్కువ సమయంలో పర్యావరణ అనుమతులు పొందిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. కేంద్ర పర్యావరణశాఖ, అటవీశాఖ, క్లైమెట్ చేంజ్ మంత్రిత్వశాఖల నుంచి అనుమతులు లభించాయి. ఏపీ సర్కార్ పంపిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి పర్మిషన్ ఇస్తున్నట్టు కేంద్రం వెల్లడించింది. కడప జిల్లా సున్నపురాళ్లపల్లె, పెద్దనందులూరు గ్రామాల్లో స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది ఏపీ హై గ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్. తొలి దశలో ఏడాదికి 3 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి, 84.7 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. మరోవైపు ప్రాజెక్ట్‌లో భాగంగా 33 శాతం.. 484.4 హెక్టార్లలో గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయనున్నారు. 2007 జూన్ 10న నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కడప ఉక్కు పరిశ్రమ కోసం భూమిపూజ చేశారు. 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో బ్రహ్మణి ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ పరిశ్రమ ప్రారంభానికి అంబవరం గ్రామ సమీపంలో పునాదిరాయి వేశారు వైఎస్సార్. 20వేల కోట్ల పెట్టుబడితో ఈ పరిశ్రమను నిర్మిస్తామని ప్రకటించారు రాజశేఖర్‌రెడ్డి. విశాఖ ఉక్కు పరిశ్రమ 29వేల ఎకరాల్లో నిర్మిస్తే, బ్రహ్మణి స్టీల్‌ని 10 వేల ఎకరాల్లో అదే సామర్థ్యంతో నిర్మిస్తామని వెల్లడించారు దివంగత నేత. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మిస్తామని చెప్పిన ప్రాంతంలో కాకుండా.. మరో ప్రాంతంలో శంకుస్థాపన చేశారు చంద్రబాబు. ఇది 2018లో జరిగింది. గండికోట రిజర్వాయర్ ఎగువన ఉన్న కంబాలదిన్నెను ఎంచుకున్నారు అప్పటి ముఖ్యమంత్రి. వై.ఎస్, చంద్రబాబు తర్వాత మూడోసారి 2019 డిసెంబర్ 23న స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు జగన్.

## గూడూరు లోని డి ఆర్ ఆర్ డబ్ల్యూ కాలేజీలో జాతీయ ఐక్యత దినోత్సవం

నెల్లూరు అక్టోబరు 29, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని డి ఆర్ ఆర్ డబ్ల్యు కాలేజీ ప్రాంగణంలో జాతీయ ఐక్యత దినోత్సవ ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం, కేంద్ర ఫీల్డ్ అవుట్ రీచ్ బ్యూరో అధికారి బి తారక ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం పై ఈ నెల 30వ తేదీన అవగాహనా కార్యక్రమాన్ని గూడూరు డి ఆర్ డబ్ల్యు లో నిర్వహించబడుతుంది అని పేర్కొన్నారు .75 వసంతాల స్వాతంత్ర్య అమృత్ మహోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది. ఈ సందర్భంగా ముందుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడంతోపాటు, భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమా లు,వ్యాసరచన,వక్తృత్వం మొదలైన పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ ఛైర్పర్సన్ పొనక దేవసేనమ్మ, గూడూరు శాసన సభ్యులు వెలగపల్లి వర ప్రసాద రావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని తమ అమూల్యమైన సలహాలు సందేశం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు.

# సేఫ్ ప్లేస్ కోసం లోకేష్



గుంటూరు, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)నారా లోకేష్ కు వచ్చే ఎన్నికలు మరింత సవాలుగా మారనున్నాయి. ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో తన నియోజకవర్గంలో కూడా విస్తృతంగా పర్యటించాల్సి ఉంటుంది. అయితే మంగళగిరి నియోజకవర్గమయితే రాష్ట్రం మొత్తం పర్యటించడం సాధ్యం కాదని లోకేష్ తో పాటు చంద్రబాబు కూడా భావిస్తున్నారు. ఒక్క మంగళగిరికే లోకేష్ పరిమితమయితే నాయకుడిగా ఎదగడం సాధ్యం కాదు. దీంతో నారా లోకేష్ వచ్చే ఎన్నికల్లో మంగళగిరిలో పోటీపై సందిగ్దంలో పడినట్లు తెలుస్తోంది. రాజధానిని తరలిస్తామని జగన్ ప్రకటించిన తర్వాత కూడా అక్కడ జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. ప్రజలు ఎక్కువ మంది టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని ఫీడ్ బ్యాక్ వస్తున్నా లోకేష్ దానిని విశ్వసించడం లేదు. మరో సారి ఓటమి పాలయి నవ్వుల పాలు కాకూడదన్నది నారా లోకేష్ నిర్ణయంగా ఉంది. మంగళగిరిలో వైసీపీకి పట్టుంది. ఆళ్ల రామకృష్ణారెడ్డి మరోసారి పోటీ చేస్తే ఎదుర్కొనడానికి పూర్తి సమయాన్ని కేటాయించాల్సి వస్తుంది. నాలుగు రోజులు ప్రచారానికి వెళ్లి వస్తే మొన్నటి ఫలితాలే రిపీట్ అయ్యే అవకాశముంది. అందుకే మంగళగిరిని వదిలేయాలన్న ఆలోచనలో నారా లోకేష్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనకు సేఫ్ ప్లేస్ కోసం వెదుకుతున్నట్లు సమాచారం. సులువుగా గెలిచే నియోజకవర్గాన్ని లోకేష్ ఎంచుకుంటారని చెబుతున్నారు. రాయలసీమ ప్రాంతమైన కుప్పం నుంచి చంద్రబాబు పోటీ చేస్తున్నారు. దీంతో ఆయన సీమ నుంచి పోటీ చేసే అవకాశం లేదు. ఇక ఉత్తరాంధ్ర, కోస్తాలో ఎక్కడి నుంచైనా పోటీ చేయాలి. నారా లోకేష్ కు కృష్ణా జిల్లాలోని పెనమలూరు, విశాఖ జిల్లలోని భీమిలి నియోజకవర్గాలపైనే దృష్టి ఉందంటున్నారు. ఎన్నికలకు ముందు సర్వే చేయించిన తర్వాత మాత్రమే ఏ నియోజకవర్గం నుంచి పోట ?చేయాలన్న నిర్ణయాన్ని లోకేష్ తీసుకుంటారంటున్నారు. మంగళగిరిలో మాత్రం మరోసారి పోటీ చేసే సాహసం లోకేష్ చేయకపోవచ్చు. విమర్శలు వచ్చినా పెద్దగా పట్టించుకోకూడదని డిసైడ్ అయ్యారు.

## మళ్లీ యాక్టివ్ అవుతున్న పుల్లారావు

గుంటూరు, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)ఎన్నికలకకు సమయం దగ్గరపడుతుండటం, ఏపీలో రాజకీయ పరిణామాలు క్రమంగా మారిపోతుండటంతో టీడీపీ నేతల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. నిన్న మొన్నటి వరకూ నియోజకవర్గానికి దూరంగా ఉంటూ, వ్యాపారాలకే పరిమితమైన నేతలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. టీడీపీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చిలకలూరి పేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కూడా వారిలో ఒకరు. ఆయన ఈ మధ్య కాలంలోనే నియోజకవర్గంలో పర్యటిస్తూ క్యాడర్ లో భరోసా నింపుతున్నారు. 2019 ఎన్నికల్లో తాను ఓటమి పాలవుతానని ప్రత్తిపాటి పుల్లారావు ఊహించలేదు. మంత్రిగా ఐదేళ్ల పాటు తాను నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని కూడ పట్టించుకోలేదని ఆయన వాపోయేవారు. అందుకే నియోజకవర్గానికి దూరంగా



దాదాపు రెండేళ్ల పాటు ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ప్రత్తిపాటి పుల్లారావు పెద్దగా పట్టించుకోలేదు. ఫోన్ లోనే ముఖ్యమైన నేతలతో మంతనాలు జరిపేవారు. దీనికి తోడు ప్రత్తిపాటి పుల్లారావు పై రాజధాని కేసుల కూడా నమోదయ్యాయి. ఈ కారణంగా ఆయన రాజకీయాలకు బాగా దూరంగా ఉన్నారు. అయితే చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ లో విభేదాలు తలెత్తడం, టీడీపీ పొత్తులతో ఎన్నికలకు వెళ్లాలని సంకేతాలు ఇవ్వడం వంటి వాటితో ప్రత్తిపాటి పుల్లారావు తిరిగి యాక్టివ్ అయ్యారు. ఇటీవల కాలంలో ఆయన తన నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. మండలాల వారీగా నేతలతో సమావేశం అవుతున్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసులు, బాధితుల జాబితాను తీసుకుని వారిని ఊరడించే ప్రయత్నం ప్రత్తిపాటి పుల్లారావు మొదలు పెట్టారు. నిన్న మొన్నటి వరకూ నేత లేకుండా లబోదిబోమన్న క్యాడర్ ప్రత్తిపాటి రాకతో ఉత్సాహంతో ఉరకలేస్తుంది. మొత్తం మీద ఇన్నాళ్లు పొరుగు రాష్ట్రానికే పరిమితమైన నేతలు ఇప్పుడిప్పుడే నియోజకవర్గంలో కనిపిస్తుండటం పార్టీ అధినేతకు ఊరటనిచ్చే అంశమే.

## పంచాయితీలకు ట్రాక్టర్

నెల్లూరు, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో 2 వేల జనాభా దాటిన ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించే చెత్తను తరలించడానికి, రోడ్ల పక్కన పెంచే మొక్కలకు ఆ ట్రాక్టర్ ద్వారానే నీటి తడులు అందించేందుకు ఈ ట్రాక్టర్లు వినియోగించేలా ఆలోచనలు చేస్తోంది. ఈ ట్రాక్టర్ల నిర్వహణకు అయ్యే వ్యయ భారం సదరు గ్రామ పంచాయతీలపై పడకుండా ప్రభుత్వం మార్గాలను విశ్లేషిస్తుంది. రాష్ట్రంలో 2 వేలకు పైబడి, 5 వేల లోపు జనాభా ఉండే గ్రామాలు 5 వేల పైచిలుకు ఉన్నాయి. వీటికి సొంత ట్రాక్టర్లు అందుబాటులో లేవు. ఈ క్రమంలో 5 వేల లోపు జనాభా కలిగిన 5137 పంచాయతీలకు ట్రాక్టర్లు ఇవ్వాలని ప్రభుత్వం దాదాపు నిర్ణయం తీసుకుంది. ఇవికాక 5 వేలకు పైబడిన జనాభా కలిగి సొంత ట్రాక్టర్లు లేని పంచాయతీలు 91 ఉన్నాయి. ఆయా పంచాయతీలకు కూడా ట్రాక్టర్లు ఇవ్వాలని భావిస్తోంది. మొత్తం 5,228 గ్రామాలకు ఉచితంగా కొత్తగా ట్రాక్టర్లు అంజేయాలన్నది ప్రభుత్వ యోచన. గ్రామ పంచాయతీ ఇతర అవసరాలకు కూడా ఈ ట్రాక్టర్లను వినియోగించుకునేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. రోడ్ల పక్కన నాటే మొక్కలకు నీటి తడులు ఇవ్వడానికి గాను నాటిన ప్రతి మొక్కకు రెండేళ్లలో రూ.280 చొప్పున ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు చెల్లిస్తోంది. ఇలా 400 మొక్కలు ఒక యూనిట్‌గా చేసుకుని ప్రతి యూనిట్‌కు రూ.1.12 లక్షల చొప్పున ఇస్తోంది.

# కొండెక్కిన చికెన్ ధర



అనంతపురం, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)కేజీ చికెన్ ధరలు అమాంతం పెరగడంతో ఆ సరదాలు, సంతోషాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. మూడు నెలల్లో కేజీ రూ.110 నుంచి రూ.200లకు చేరుకుంది. దీంతో ప్రతివారం చికెన్ తెచ్చుకునేవారు మధ్యమధ్యలో మానేస్తున్నారు. మరికొందరు కేజీ తెచ్చుకునేకాడ అరకేజీ తెచ్చుకుని సరిపెట్టుకుంటున్నారు. మరికొందరు ప్రత్యామ్నాయంగా చేపలు తెచ్చుకుంటున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లో 300కు పైగా చికెన్ దుకాణాలున్నాయి. సగటున ఒక్కో దుకాణంలో రోజూ వంద నుంచి 500 కేజీల వరకు చికెన్ విక్రయించేవారు. అయితే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వేసవి కారణంగా కోళ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దీనికితోడు రవాణా ఖర్చులు, దాణా, కోళ్లఫారం నిర్వహణ వ్యయం పెరుగుతూ వస్తోంది. ఫలితంగా కోళ్ల పెంపకం చేపట్టిన బడా కంపెనీలు నష్టపోయాయి. ఇప్పుడు పండుగల సీజన్ కావడంతో ఆ నష్టాలను పూడ్చుకునేందుకు వారంతా సిండికేట్‌గా ఏర్పడి కోళ్ల ధరలను పెంచేస్తున్నారని, అందుకుగానూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని వ్యాపారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలు రంగప్రవేశం చేయడం చిన్నచిన్న కోళ్లఫారాలు నిర్వహించడం కష్టమైపోయింది. దీంతో బడా కంపెనీలు నిర్ణయించినదే రేటుగా మారింది. ఈ నెల మొదటివారంలో కేజీ రూ.130లుగా ఉండే చికెన్ ధర ప్రస్తుతం కొండెక్కి రూ.200లకు చేరుకోవడంతో పేదప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ధర్మవరంలో చేనేత కార్మికులు సరసమైన ధరలకు లభించే చికెన్‌పై ఎక్కువ మక్కువ చూపేవారు. కానీ ఇప్పుడు అది కూడా అందుబాటు ధరల్లో లభించడం లేదని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కోళ్లఫారం నిర్వాహకులకు ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారానైనా ధరలను నియంత్రించాలని మాంసాహార ప్రియులు కోరుతున్నారు.

# వ్యక్తి అనుమానాస్పద మృతి..

**వ్యాక్సిన్ వలనే మరణించడంటూ బంధువుల ఆరోపణలు**

**క్రానికల్ డిసీస్ వల్లే మృతి చెందాడని వైద్యులు వెల్లడి**

మచిలీపట్నం అక్టోబరు 29, (న్యూస్ పల్స్)మచిలీపట్నం మండలం పరిధిలోని రుద్రవరం గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. స్థానికంగా వుంటున్న బొడ్డు ఆంజనేయులు (29) మృతి వివాదానికి తెరలేపింది. వివరాలు ఇలా వున్నాయి.ఈనెల 22న రుద్రవరం గ్రామంలో ఆశావర్కర్, అంజనేయులు ఇంటివద్దకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకోమని కోరింది. తాను నేను కొద్దిసేపటి క్రితమే మద్యం సేవించాను. ఇప్పుడు వ్యాక్సిన్ వద్దు అని అంజనేయులు చెప్పినప్పటికీ ఆశావర్కర్ బలవంతంగా వ్యాక్సిన్ వేసినట్లు బంధువుల ఆరోపణ. వ్యాక్సిన్ వేసుకున్న రెండురోజులకు మృతుడు ఆంజనేయులుకు కళ్ళు తిరగడం, ఫిట్స్ రావడం ప్రారంభం అయ్యాయని వారు వెల్లడించారు. గురువారం రాత్రి అంజనేయులు మృతిచెందాడు. వ్యాక్సిన్ వేయడం వల్లే అంజనేయులు మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడు ఆంజనేయులుకి తల్లి తండ్రి లేరు..ఇతనిపై చెల్లి, తమ్ముడు, బార్య ఆదారపడి ఉన్నారు. ఆంజనేయులు మృతితో ఆ కుటుంబం ఎవరిపై ఆధారపడాలి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు, జిల్లా వైద్య అధికారులు మాట్లాడుతూ వ్యాక్సిన్ కు అల్కహాల్ కు ఎలాంటి సంబంధం లేదని తేల్చేశారు. మృతునికి గతం నుండే ఏదైనా క్రానికల్ డిసీస్ ఉండడం వల్లే ఇలా జరిగిందని ప్రాదమిక విచారణలో వెల్లడైందని తెలిపారు.

# చిత్తూరు జిల్లా వి.కోటలో టిడిపి ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

**నిరసనగా టిడిపి నాయకుల ధర్నా..**

**పోలీసుల తీరుకు నిరసనగా జాతీయ రహదారి పై బైటాయింపు**

చిత్తూరు అక్టోబరు 29, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ జాతీయ అధినేత రాష్ట్ర ప్రతిపక్ష నేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు ర్యాలీగా వెళుతున్న టిడిపి నేతలను వీకోట పోలీసులు అడ్డుకున్నారు. ఈ ర్యాలీకి అనుమతులు లేవంటూ తెలుగుదేశం పార్టీ నాయకులను అడ్డగించారు. తమ పార్టీ అధినేతపై అభిమానంతో కార్యకర్తలు స్వచ్ఛందంగా ర్యాలీకి బయలుదేరితే వాటిని పోలీసులను అడ్డుపెట్టుకుని అడ్డుకోవడం ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ముప్పై తమ పార్టీ అధినేత పర్యటనలో తిలకించేందుకు వెళితే ఇలా పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పలమనేరు - కుప్పం జాతీయ రహదారిపై అంబేద్కర్ కూడలిలో టిడిపి నేతలు బైఠాయించడంతో ఎట్టకేలకు పోలీసులు ర్యాలీకి అనుమతి ఇచ్చారు.

# విద్యార్థుల అందోళన

నెల్లూరు అక్టోబరు 29, (న్యూస్ పల్స్)ఎపి సిఎం జగన్ పై,వైసిపి పై విద్యార్థి సంఘులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎయిడెడ్ స్కూల్స్,కాలేజిల మూసివేత పై పోలీసులతో విద్యార్థులు ఘర్షణకు దిగారు. నెల్లూరు జిల్లాలో వి ఆర్ కళాశాల సహా పలు విద్యాసంస్థలకు ఎయిడ్ మినహాయించడం పై ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆందోళన చేసారు. నెల్లూరు వి ఆర్ కళాశాల కూడలిలో ఎస్ఎఫ్ఐ రాస్తారోకో చేసారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో లకు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసన వెల్లెవెత్తింది. వారిని పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థులకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎస్ఎఫ్ఐ విద్యార్థులను అరెస్టు చేసారు. ఎయిడెడ్ విద్యాసంస్థల పరిరక్షణ కోసం తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు హెచ్చరించారు..

# ముప్పై ఏళ్ల నుంచి అక్రమ స్మగ్లింగ్

తిరుపతి, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో ఐదు జిల్లాల్లోని అడవుల్లో ఉన్న అరుదైన ఎర్రచందనం స్మగ్లర్ల పాలవుతోంది. ఈ అక్రమ రవాణా 30 ఏళ్లకు పైగా జరుగుతూనే వుంది. ఆ వివరాల ప్రకారం ఎర్రచందనం సంపద ఏడు దశల్లో స్మగ్లర్లు నిర్వహిస్తున్నారు.ఎక్కువగా తమిళనాడు రాష్ట్రం జవ్వాదిమలై కొండల్లోని గిరిజన తెగలకు చెందిన వేల కుటుంబాలు ఈ చెట్లను నరుకుతున్నట్లు సమాచారం. ఎర్రచందనం అక్రమ రవాణాకు ఎం తోమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారు. శేషాచల అటవీ శివార్లు, కరకంబాడీ, మామండురు, జూపార్క్ రోడ్డు, శ్రీవారి మెట్టు, భాకరాపేట తదితర చోట్ల తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబరు కలిగిన వాహనా లు కనపడితే ఆయా ప్రాంతాల్లో మాటువేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్రమత్తం అవుతారు. కూంబింగ్ చేస్తున్న సిబ్బంది వెంటనే ఆ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించడం, ఆ వాహనాలు ఎక్కడికి వెళ్తున్నాయనే దిశగా పూర్తిస్థాయి నిఘా పెడుతున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా.. వెంటనే తమ అధీనంలోకి తీసుకుని సోదాలు చేసి అరెస్టు చేశారు.అయితే ఏస్థాయిలో ఏవిధంగా ఎలాంటి వారు ఈ రవాణాలో పాల్గొంటారనే దానిపై స్పష్టత రావడం లేదు. ఎర్రచందనానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పడిన తర్వాత కొంతవరకు అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. అయితే స్మగ్లర్లు ఎప్పటికప్పుడు కొత్తమార్గాలను అన్వేషిస్తూ.. ముందుకెళ్తున్నారు. టాస్క్‌ఫోర్స్ ఐజీ అనేక సంస్కరణలు తీసుకువచ్చి దశలవారీగా అక్రమ రవాణా మూలాలను గుర్తించారు.మొదటిదశలో తమిళనాడులోని అటవీప్రాంతాల్లో చెట్లను నరకడంలో సిద్ధహస్తులైన గిరిజన తెగలకు చెందినవారికి నగదు ఆశ చూపించి ఇక్కడికి రప్పిస్తారు. రెండవ దశలో గిరిజన తెగలకు చెందిన వారు నరికిన దుంగల బరువుకు తగిన విధంగా అడవుల్లోనే నగదు చెల్లింపులు చేస్తారు. ఈ దశలో మేస్త్రి కీలకపాత్ర పోషిస్తాడు. మూడవ దశలో నరికిన దుంగలను మేస్త్రి చెప్పినచోటకు చేర్చి అక్కడ ఏర్పాటు చేసిన వాహనంలో లోడ్ చేయడంతో తమిళనాడు స్మగ్లర్ల పని సమాప్తమవుతుంది. లోడ్ చేసిన వాహనాన్ని అనుకున్న చోటకు చేర్చడంలో వాహన డ్రైవర్‌కు.. పైలెట్‌గా వ్యవహరించే వ్యక్తి సమాచారం అందిస్తారు. నాల్గవ దశలో వాహనాన్ని తీసుకెళ్లడం, లోడ్ చేసిన వాహనాన్ని గమ్యస్థానం చేరేవరకు వివిధ రకాల వ్యూహాలను అనుసరించే ట్రాన్స్‌పోర్టర్ ముఖ్య పాత్ర పోషిస్తాడు. ఐదవదశలో వాహనంలో వచ్చిన ఎర్రచందనం దుంగలను గోడౌన్‌లలో భద్రపరచడం, వాటిని కాపలా కాసే వ్యక్తి గోడౌన్ కీపర్‌గా వ్యవహరిస్తాడు. ఆరవ దశలో గోడౌన్ నుంచి విదేశాలకు పంపేందుకు కావాల్సిన అనుమతులు సృష్టించడం, దానికోసం లంచాలు ఇచ్చి విదేశాలకు ఎగుమతి చేయడంలో ఎక్స్‌పోర్టర్ కీలకపాత్ర పోషిస్తాడు. ఇక ఏడవ దశలో ఎక్స్‌పోర్టర్ పంపిన దుంగలను అందుకుని వాటిని విక్రయిం చే ఇంటర్నేషనల్ స్మగ్లర్ చివరగా పని పూర్తి చేస్తాడు. దుంగలను స్మగ్లింగ్ చేసే క్రమంలో ఒకవ్యక్తికి.. మరో వ్యక్తి ప్రత్యక్ష సంబంధం లేకపోవడం ఇందులో గమనించాల్సి అంశమని టాస్క్‌ఫోర్సు పోలీసులు చెబుతున్నారు..ఇటీవల అనుమానం వచ్చిన నాలుగైదు వాహనాలను సోదాలు చేయడంతో.. ఎర్రచందనం దుంగలు భారీగా పట్టుబడ్డాయి. ఒక వాహనానికి బీటెక్ చదివిన యువకుడు డ్రైవర్‌గా వచ్చి పోలీసులకు చిక్కాడు.

# శ్రీ శైలంలో గుప్త నిధులు

కర్నూలు, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)శక్తిపీఠం, జ్యోతిర్లింగం ఒకే ప్రాంగణంలో కొలువైనది శ్రీశైలంలో మాత్రమే. అందుకే శ్రీశైలానికి నాభి స్థలం అని పేరు. శక్తి పీఠాలకు, జ్యోతిర్లింగాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతటి పవిత్రత ప్రాధాన్యత ఉందో అందరికీ తెలిసిందే. అలాంటి శ్రీశైలంలో అతి పురాతన కాలం నాటి బంగారు వెండి నాణెములతో పాటు ఎంతో విలువైన సమాచారం ఉన్న తామ్ర శాసనాలు లభిస్తుండటం సంచలనంగా మారింది. శ్రీశైలం ఏ కాలానికి చెందినది అనే దానికి సంబంధించి ఇప్పటికీ స్పష్టమైన ఆధారాలు లేవు. క్రీస్తు పూర్వమే శ్రీశైలం ఉన్నట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. యుగయుగాల చరిత్ర ఉన్న శ్రీశైలంలో ఇప్పుడు నిధులు దొరకడం అనేది అత్యంత చర్చనీయాంశంగా మారింది.పూర్వ కాలంలో ఋషులు, మహర్షులు శ్రీశైలంలో ఉండి రోజుల తరబడి తపస్సు చేసేవారట. ఆ తపస్సు చేసేందుకు ఏర్పాటు చేసుకున్నవే పంచ మటాలు. ఈ పంచమఠాలను పునర్నిర్మించేందుకు దేవస్థాన అధికారులు అన్ని రకాల అనుమతులతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. ముందుగా గంటా మఠం పనులు మొదలు పెట్టారు. పనులు జరుగుతుండగా చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పనులు జరుగుతుండగానే ఒక్కొక్కటిగా అప్పటి బంగారు వెండి వజ్రాలతో పాటు తామ్ర శాసనాలు కూడా పెద్ద ఎత్తున లభ్యమయ్యాయి. తామ్ర శాసనాలలో ఉండే సమాచారం అద్భుతమైనదిగా, ఎంతో విలువైనదిగా చరిత్రకారులు భావిస్తున్నారు. వివిధ భాషలతో పాటు తెలుగు లిపి కూడా తామ్ర శాసనాలలో ఉందట. ఆలయానికి ఎవరెవరు ఎక్కడ ఎక్కడ ఆస్తులు ఇచ్చారు, అవి ఎక్కడ ఉన్నాయి అనే సమాచారం కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు. జీర్ణోద్ధరణ పనులలో లభ్యమైన బంగారు, వెండి నాణేలను మాత్రం అధికారులు బహిర్గతం చేశారు. వాటిని భద్ర పరిచినట్లు కూడా ఆలయ అధికారులు వివరించారు.కాగా, నిధులు దొరికిన విషయం పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో శ్రీశైలంపై గుప్తనిధుల వేటగాళ్ల కన్ను పడినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంటా మఠంలో నిధులు దొరికిన తరువాత శ్రీశైలంలో అర్ధరాత్రి వేళ ఆలయంపై డ్రోన్ కెమెరాలు చక్కర్లు కొట్టాయి. ఈ డ్రోన్ కెమెరాలు ఎందుకు వచ్చాయి అనే దానిపై అప్పట్లో ఆందోళన వ్యక్తం అయినప్పటికీ ఇంతవరకు ఆ పని ఎవరు చేశారనేది తేల్చలేకపోయారు. అదే సమయంలోనే మల్లమ్మ కన్నీరు ఆలయం వెనుక ఉండే విశ్వామిత్ర ఆలయంలో పురాతన శివలింగాన్ని పెకిలించి వేశారు. పెద్ద గోతులు తవ్వారు. ఇక్కడికి అతి సమీపంలోనే జనసంచారం ఉన్నప్పటికీ ఎవరు చేశారనే దానిపై ఇంతవరకూ స్పష్టత లేదు. దీనిపై ఫిర్యాదు అందినప్పటికీ పోలీసులు తేల్చలేక పోయారు. గుప్త నిధుల కోసమే దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీశైలంపై గుప్తనిధుల వేటగాళ్ల కన్నుపడిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుప్తనిధుల కోసం తవ్వకాలు కానీ ఇతరత్రా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామనిచ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆలయ ఈవో తెలిపారు.ఇదిలాఉంటే.. పంచమఠాల జీర్ణోద్ధరణ పనులలో లభ్యమైన పురాతన బంగారం, వజ్రాలు, వెండి నాణేలను మ్యూజియంలో భద్రపరచాలని, భావితరాలకు సమాచారం అందించాల్సిన వాటి గురించి గోప్యత వద్దని స్థానికులు సూచిస్తున్నారు. అంతేకాకుండా గుప్తనిధుల వేటగాళ్ల దాడులు జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ.. శ్రీశైలంలో ప్రస్తుతం లభ్యమైన నిధులతో.. భవిష్యత్తులో ఎక్కడ ఎక్కడ నిధులు లభ్యం కాబోతున్నాయనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నిర్దేశించిన రంగాలకు రుణ సౌకర్యం కల్పించాలి**

**అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డి**

**జిల్లా కేంద్రంలో రుణ వితరణ కార్యక్రమం**

ఆసిఫాబాద్ అక్టోబర్29 జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్ లో శుక్రవారం అన్ని బ్యాంకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రుణ వితరణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి చెందాలంటే ఆర్థికంగా ప్రజలు అభివృద్ధి చెందాలని దీనికి బ్యాంకర్లు తోడ్పాటు అందించాలన్నారు. జిల్లాలో ఎక్కువగా రైతులు ఒకే పంట పై ఆధారపడి జీవిస్తున్నారని పంట రుణాల విషయంలో బ్యాంకర్లకు ఇచ్చిన లక్ష్యాన్ని నెరవేర్చలేదన్నారు. పంట రుణం లక్ష్యాన్ని 90% ఖరీఫ్ లో చేరుకోవాలని నిర్దేశించినప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు భవిష్యత్తులో బ్యాంకర్లు తమ విధానాలను మార్చుకోవాలని సూచించారు. అలాగే ప్రజల వద్ద ఆర్థికంగా ఎదుగుదల ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో రుణం తీసుకున్న వారు తిరిగి చెల్లించడంలో ఎటువంటి ఇబ్బందులకు గురి చేసిన తాము బ్యాంకర్లకు అండగా ఉంటామని చెబుతున్నామని సిర్పూర్ లో అనేకమంది దగ్గరినుండి రుణం రికవరీ చేయడంలో సహాయపడటం జరిగిందని గుర్తు చేశారు. ఇళ్లలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని వారికి వివిధ రకాల రుణాలు అందించి ఆర్థికంగా ఎదిగే విధంగా చేయాలన్నారు. జిల్లాలో రుణం తీసుకొని రైతులు 40,000 మంది ఉన్నారని వీరికి ఇతర రకాల రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించాలని తెలిపినప్పటికీ ఇప్పటివరకు కేవలం రెండు వేల మందికి మాత్రమే రుణం అందించారని అన్నారు. బ్యాంకర్లు ఇదే విధానాన్ని కొనసాగిస్తే ఎన్ని సంవత్సరాలైనా జిల్లా అభివృద్ధి చెందదని అభివృద్ధి చెందిన జిల్లా గా మారడానికి బ్యాంకింగ్ సెక్టార్ ఎంతో ముఖ్యమైనది అన్నారు. జిల్లాలో మాల్ న్యూట్రిషన్ తగ్గించడం సాధ్యమైందని కానీ బ్యాంకింగ్ సెక్టార్ సరిచేయడం తమ వల్ల కావడం లేదని అన్నారు. రుణ వితరణ కార్యక్రమం మంచిదేనని అయితే ఇది కేవలం పేరు కోసం మాత్రమే చేయకూడదని చురకలంటించారు.

అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన రంగాలకు రుణాలు అందజేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో ఇరిగేషన్ అభివృద్ధి కోసం విద్యుత్ సరఫరా కూడా చేశామని అయితే రైతులు బోర్వెల్ వేయడానికి రుణాల కోసం బ్యాంకు వస్తే తిరస్కరించకూడదని అన్నారు. జిల్లాలో వెయ్యి లీటర్ల సామర్థ్యంతో ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, కాగజ్ నగర్ కేంద్రాలలో

ఒక్కోచోట పాల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని రైతులకు హైబ్రిడ్ పశువులు తీసుకురావాలని సూచించామని వారికి రుణాలు అందించాలన్నారు. హ్యాండ్ క్రాఫ్ట్ మార్కెట్ కోసం హైదరాబాద్, మంచిర్యాల లాంటి ప్రాంతాలకు తయారీ వస్తువులు పంపించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఢిల్లీలో వచ్చే నెల 16 నుండి 31 తారీఖు వరకు హ్యాండ్ క్రాఫ్ట్ మేళా లో ఆసిఫాబాద్ జిల్లా కు చెందిన డ్వాక్రా గ్రూప్ సభ్యులు పాల్గొంటున్నారని వీరికి బ్యాంకులు కొంత సాయం అందించడంతో ఇది సాధ్యమైందన్నారు. ఇలా జిల్లాలో పుట్టగొడుగుల సాగు, వెదురు సాగు తో పాటు, విద్యార్థులకు విద్యా రుణాలు అందజేయాలన్నారు దీనితో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా బ్యాంకర్లు కృషి చేయాలని కోరారు. అనంతరం ఆసిఫాబాద్ కాగజ్నగర్ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకర్లు అందిస్తున్న రుణాలకు సంబంధించి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కోవా హనుమంతరావు, ఎస్బిఐ నిజామాబాద్ డీజీఎం ప్రఫుల్ల కుమార్, డెక్కన్ గ్రామీణ బ్యాంక్ ఆర్ ఎం శ్రీనివాస్ రెడ్డి ఏడిసిసి ఎజిఎమ్ అబయ్ కుమార్ అన్ని బ్యాంకుల అధికారులు, రుణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ల కు ఇండి పెండేంట్ కు ఈ మీటింగ్ లో నైనా మైక్ ఇస్తారా లేక బెల్లు కొడతారా

నంద్యాల అక్టోబర్ 29 శనివారం నాడు జరుగుతున్న మున్సిపల్ మీటింగ్ లో ప్రతి పక్ష పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లకు 12 వార్డు ఇండి పెండేంట్ కౌన్సిలర్ కు మీటింగ్ హాలులో వారి వార్డు పరిధిలోని సమస్యలను తెలియజేసేందుకు వారికి ఈ సారైన మైక్ ఇస్తారా ఇవ్వరా అనే దానిపై చాలా మంది ప్రజల బిన్నప్రయాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో మున్సిపల్ అధికారులపై సబ్ కలెక్టర్ గారి ధ్రుష్టికి తీసుకొని పోయిన నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి. ఈ విషయాన్ని నేను కమిషనర్ తో మాట్లాడుతాను సరైన న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారని. భూమ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఇప్పటికే మూడు మీటింగు లో మైక్ ఇచ్చి ఉంటే కొన్ని అయినా సమస్యలు మున్సిపల్ కమిషనర్ కు మరియు మున్సిపల్ చైర్మన్ కు తెలిపే వారమని తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు అంటున్నారు. ఏది ఏమైనా ప్రతి కౌన్సిలర్ వారి వార్డుల్లో సమస్యలను సభా సంఘానికి తెలియ జే చేందుకు అందరికీ అవకాశం ఇవ్వాలని పలువురు విశ్లేషకులు కోరుతున్నారు.

# పట్టాభి అరెస్ట్ కేసులో ఏసీపీ రమేష్ సీఐ నాగరాజుపై వేటు

అమరావతి అక్టోబర్ 29 టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి అరెస్ట్ కేసులో ఇద్దరు పోలీసు అధికారులపై వేటు పడింది. అరెస్ట్ సందర్భంగా నిబంధనలు సరిగా పాటించకపోవడంతో ఉన్నాధికారులు చర్యలు తీసుకున్నారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏసీపీ రమేష్ సీఐ నాగరాజుపై వేటు వేశారు. పట్టాభి అరెస్ట్ సమయంలో నోటీసులు జారీ చేసిన విషయంలో అలసత్వం వహించారన్న కారణంగా ఇద్దరు పోలీసు అధికారులను బదిలీ చేశారు. 41ఏ సీఆర్పీసీ కింది పట్టాభికి పోలీసులు నోటీసులిచ్చారు. ఆ నోటీసుల్లో ఖాళీగా ఉండడాన్ని న్యాయస్థానం కూడా తప్పుబట్టింది.ఈ నేపథ్యంలోనే పోలీసులపై చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏసీపీ రమేష్ సీఐ నాగరాజును విధుల నుంచి తప్పించారు. ఏసీపీ రమేష్ కొంతకాలంగా టాస్కోఫ్ఫోర్స్ పనిచేస్తున్నారు. నాగారాజు గవర్నర్ పేట పోలీస్ స్టేషన్ లో సీఐగా పనిచేస్తున్నారు. ఏసీపీ రమేష్ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఐ నాగరాజును ఏలూరు రేంజ్ డీఐజీకి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.మరోవైపు పట్టాభిని ఐదురోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటీషన్ను గురువారం కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. పట్టాభిని అరెస్ట్ చేసిన తర్వాత కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావించారు. పట్టాభి తరపున న్యాయవాది లక్ష్మీనారాయణ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్పై అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టాభికి ఇప్పటికే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ ఇన్ సక్సెస్ అవుతుందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ను కొట్టివేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

# ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అక్టోబరు 29, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా పీలేరు లో ఒక ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసింది. చిత్తూరుజిల్లా కలకడ మండలం బాలయ్యగారి పల్లి పంచాయతీ వడ్డిపల్లి కిచెందిన సద్గురు (21), అదే మండలం అరెపెంట దిన్నే చెందిన సింధు ప్రేమించుకున్నారు. ఇద్దరి కుటుంబ సభ్యులు వారి పెళ్లికి తిరస్కరించడం తో గుళికల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసారు. ఘటనలో సద్గురు మృతి చెందాడు. సింధు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. సద్గురు మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# లారీ బోల్తా? డ్రైవర్ క్షేమం

విశాఖపట్నం అక్టోబరు 29, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లా నర్సీపట్నం - తుని రహదారిలో నాతవరం మండలం , గాంధీ నగరం వద్ద భారీ ప్రమాదం తప్పింది. శుక్రవారం తెల్లవారుజామున లారీ డ్రైవర్ నిద్రమత్తులో వాహానాన్ని నడిపాడు. అదుపుతప్పిన లారీ గాంధీ నగరం వద్ద రోడ్డును ఆనుకొని ఉన్న కల్వర్ట్ గోడ ఎక్కి పక్కకు పడిపోయింది. లారీలో సరుగుడు దుంగలున్నాయి. ఘటనలో లారీ సగం వరకు ఛిద్రం అయింది. అదృష్టవశాత్తె డ్రైవర్, క్లీనర్ క్షేమం గా బయటపడ్డారు..

# తాటిపాక ప్రభుత్వ పాఠశాలలో కరోనా కలకలం

**ఏడుగురు టీచర్లకు కరోనా..రెండు రోజులు స్కూలుకి సెలవులు**

రాజోలు అక్టోబరు 29, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి రాజోలు మండలం తాటిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరోనా కల్లోలం రేపింది. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులకు కోవిడ్ పాజిటివ్ రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురైయారు. అప్రమత్తమయిన అధికారులు పాఠశాల ఆవరణలో తరగతి గదులు, బెంచీలు పూర్తిగా శానిటైజ్ చేయించారు. ఉపాధ్యాయులు కరోనా బారినపడిన విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెల్లడంతో రెండు రోజుల పాటు స్కూలుకి సెలవులు ప్రకటించారు.

# పీకే డబ్బు మనిషి..బిచ్చగాడు

తిరుపతి అక్టోబరు 29,(న్యూస్ పల్స్) ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ డబ్బు మనిషని, ఆయనకు ఏమి తెలుసునని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు చింతామోహన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్‌పై పీకే చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ పీకే జర్నలిస్టులను పక్కన పెట్టుకుని వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ చూడటానికి చిన్నగా కనిపించవచ్చు కానీ గొప్ప నాయకుడని కొనియాడారు. కాంగ్రెస్ గురించి ప్రశాంత్ కిషోర్ మాట్లాడమేంటని మండిపడ్డారు. ఆయన ఓ బచ్చగాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలహీన పడటానికి కారణం ఇద్దరు నాయకులని విమర్శించారు. వారిలో పీవీ నరసింహారావు ఒకరని.. అయోధ్య ఘటనతో మైనార్టీలు దూరమయ్యారన్నారు. రాష్ట్ర విభజనకు కారణం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అన్నారు. చెన్నారెడ్డిని దించేందుకు ఒక నాయకుడు పాతబస్తీలో మారణహోమం సృష్టించారన్నారు. ఆ నాయకుడు ఇప్పుడు లేరని, చనిపోయారని చింతామోహన్ పేర్కొన్నారు.

# స్కూళ్లలో విద్యార్థుల మీద టీచర్స్ దాడులు

లక్నో అక్టోబర్ 29 రోజురోజుకూ స్కూళ్లలో విద్యార్థుల మీద టీచర్స్ దాడులు ఎక్కువవుతున్నాయి. విద్యార్థులు చదవకపోతే.. వాళ్లను బుజ్జగించడమో.. లేక బెదిరించడమో చేసి వాళ్లు చదువుకునేలా చేయడం టీచర్ల బాధ్యత. కానీ.. కొందరు టీచర్లు దాన్ని గ్రాంటెడ్‌గా తీసుకొని విద్యార్థులను ప్రతి చిన్న విషయానికి దండిస్తున్నారు. దీని వల్ల చిన్న వయసులోనే పిల్లలు మెంటల్‌గా డిస్టర్బ్ అవుతున్నారు.ఇలాంటి ఘటనలు ఇప్పటికే చాలా జరిగాయి అయినా కూడా ఉపాధ్యాయులు తమ తీరు మార్చుకోవడం లేదు. తాజాగా యూపీలో ఇటువంటి ఘటనే ఒకటి చోటు చేసుకుంది. రెండో తరగతి చదివే విద్యార్థిని హెడ్‌మాస్టర్ బిల్డింగ్ మీది నుంచి కిందకు వేలాడదీశాడు. మీర్జాపూర్‌లోని ఓ పాఠశాల హెడ్‌మాస్టర్.. మనోజ్ విశ్వకర్మ.. రెండో తరగతి చదివే విద్యార్థిని తీసుకెళ్లి బిల్డింగ్ మీది నుంచి తల కిందులుగా వేలాడదీశాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. వెంటనే పిల్లలంతా అక్కడ గుమికూడారు. ఆ పిల్లాడు భయంతో ఏడుస్తున్నాడు. హెడ్ మాస్టర్ సారీ చెబితేనే కిందికి దించుతానంటూ ఆ పిల్లాడిని బెదిరిస్తున్నాడు.ఇంతలో తోటి విద్యార్థులు గట్టిగా అరవడంతో ఆ హెడ్ మాస్టర్ పిల్లాడిని కిందికి దించాడు. అయితే.. హెడ్‌మాస్టర్ చేసిన పనిని కొందరు ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోలు వైరల్ అయ్యాయి.

# బలిపీఠం పై ఎస్. జి.టి.లు

## ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్

నెల్లూరు అక్టోబరు 29, ( విభారె) రాష్ట్రంలో ఎస్ జి పి లు బలిపీఠంపై ఉన్నారని ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బచ్చు దేవిడ్ చిన్న బాబు పేర్కొన్నారు. సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులను ఎన్నిసార్లు బలి చేస్తారు అని తన ఆవేదన వ్యక్తపరిచారు. 2001 వ సంవత్సరానికి ముందు ఉన్నత పాఠశాలలో 6,7 తరగతులు బోధనకు సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు బోధన చేస్తూ ఉండే వారని పేర్కొన్నారు. అప్పటివరకు ఆయా తరగతుల విద్యార్థుల సంఖ్య ఆధారంగా సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు, గ్రేట్ ఎ౨ తెలుగు మరియు హిందీ పండితులు ఉండే వారని తెలిపారు. ఆనాటి ప్రభుత్వం మరియు విద్యాశాఖ ఉన్నత పాఠశాలలో బోధనకు కేవలం స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే బోధన చేయాలని, నాటి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను నిర్ధాక్షణ్యంగా అనగా అంతకాలం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నప్పటికీ వారి విన్నపాన్ని పరిశీలించకుండా బదిలీలలో ఆనాటి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో కలిపి కౌన్సిలింగ్ నిర్వహించడం వల్ల వారు ఎంతో నష్టపోయారని తమ ఆవేదన వ్యక్తపరిచారు. తదుపరి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎల్ పి లకు పదోన్నతి కల్పించడం ద్వారా ఉన్నత పాఠశాలలో పూర్తిస్థాయిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండే విధంగా చర్యలు తీసుకున్నారుని అన్నారు. పై పద్ధతుల్లో ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు తరగతులు సబ్జెక్టులవారీగా స్కూల్ అసిస్టెంట్లు బోధన చేస్తూ వస్తున్న సందర్భంలో ప్రస్తుత ప్రభుత్వం నూతన విద్యా విధానం 2020 అమలులో భాగంగా విద్యావిధానంలో భారీ మార్పులను చేసిందన్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5 వ తరగతి వరకు సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు బోధిస్తూ ఉండగా, 3 నుండి 5 వ తరగతి వరకు అందుబాటులో ఉన్న ఉన్నత పాఠశాలలో కలిపి ,ఉన్నత పాఠశాలలో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్న సందర్భంలో మరోమారు సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలలో బోధించాల్సి రావడం బలిపీఠంగా భావిస్తున్నన్నారు. ఎంతోకాలం నుంచి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఎంతో మంది కనీసం 1 ప్రమోషన్ కూడా లేకుండా ఉద్యోగ విరమణ చేస్తుండగా నూతన విద్యా విధానంలో నైనా 12 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ప్రతి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునికి స్కూల్ అసిస్టెంట్ ప్రైమరీ గా నైనా పదోన్నతి కల్పిస్తారని ఆశిస్తున్న సందర్భంలో బలవంతంగా సీనియర్ సెకండ్ గ్రేడ్ లను ఉన్నత పాఠశాల కు తరలించడం శోచనీయం అన్నారు .ప్రస్తుతం ఉన్నత పాఠశాలకు తరలిస్తున్న సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు ఎంతకాలం ఆయా పాఠశాలల్లో పని చేస్తారో అనే విషయం పై ఆందోళన చెందుతున్నారని తెలియజేశారు. విద్యాబోధనలో ప్రాథమిక విద్య అతి ముఖ్యమైన ఘట్టం. ప్రాథమిక విద్యను బోధిస్తున్న సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను సంతృప్తి పరచడం, ద్వారా ప్రాథమిక విద్యా బోధన బలోపేతం చేయవచ్చునే ప్రాథమిక సూత్రాన్ని గమనించమని మనవి చేస్తున్నామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల. మధుసూదన్ రావు, మహిళ రాష్ట్ర కార్యదర్శి పాల.పద్మావతి ఆర్థిక కార్యదర్శి కొప్పోలు .వేణుగోపాల రెడ్డి లు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి వ్యక్తపరిచారు.

# 4రోడ్ల మరమ్మత్తులకై పోరాటాలు ఉధృతం చేస్తాం:ఏ ఐ వై యఫ్

డోన్ అక్టోబరు 29, ( విభారె) రోడ్ల మరమ్మతులకై పోరాటాలు ఉధృతం చేస్తాం అని ఏ ఐ వై ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సొంటి పులి శేఖర్.ఏఐవైఎఫ్ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి విజయ్ లు అన్నారు,స్థానిక పట్టణంలో మోడల్ స్కూల్ వద్ద ఏ ఐ యఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు,ఈ సందర్భంగా సొంటి పులి శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాడై పోయినా రోడ్ల మరమ్మతులు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు డోన్ పట్టణంలో మోడల్ స్కూల్ కస్తూర్బా స్కూల్ సివిల్ సప్లయర్స్ కు వెళ్లే ప్రధాన దారి చాలా దరిద్రంగా మారిందని ఈ విషయం అనేక సార్లు విద్యార్థి యువజన సమైక్య నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం ఫలితం లేదన్నారు ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రాఘవేంద్ర. అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు మరమ్మతులకు నోచుకోక కొత్త రోడ్లు వెయ్యక రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాల పైన దాడులు, నిరసన గళాలను అరెస్టు చేయడంలో ఉన్న శ్రద్ధ పాడైపోయిన రోడ్లు మరమత్తు చేసే విషయంలో లేదన్నారు జిల్లా వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో చిన్నపాటి వర్షానికే మెయిన్ రోడ్స్ సైతం జలమయమై పోతున్నాయని డ్రైనేజ్ వాటర్ రోడ్ల పైకి రావడంతో రోడ్లు అంత దుర్వాసనలు వెదజల్లుతూ రోగాలు కలిగించే దోమలకు నిలయాలుగా మారాయి అన్నారు వీటి మరమ్మతుల పైన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను ఎప్పటికప్పుడు బాగు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆయన మండిపడ్డారు ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉత్త మాటలతో కాలయాపన చేయకుండా ప్రజల పట్ల శ్రద్ధ వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారువచ్చిన అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని లేనిపక్షంలో అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలకు సిద్ధం అవుతామని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారన్నారు ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్. మండల సహాయ కార్యదర్శి రంగస్వామి .రవి ఉపాధ్యక్షులు బండపల్లి నాగరాజు. శ్రీకాంత్.. రామ్మోహన్. మహేష్ బాబు. స్వామి. రామాంజనేయులు. దస్తగిరి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా బహుముఖ ప్రజ్ఞాశాలి రాఘవ లారెన్స్ 48. వ. జన్మదిన వేడుకలు

## అనాథలకు అన్నధానం , బ్రెడ్లు ,పండ్లు పంపిణీ

మంత్రాలయం అక్టోబరు 29, ( విభారె) ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రాఘవ లారెన్స్ పుట్టినరోజు వేడుకలు అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ , సినీనటుడు, డైరెక్టర్ ,కథకుడు ,అయిన రాఘవ లారెన్స్ 48 వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలనుండి అభిమానులు పెద్దఎత్తున మంత్రాలయం కు చేరుకున్నారు. శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు రాఘవలారెన్స్, కుటుంబ సభ్యులు గోత్రనామము పేరు మీదుగా ఆన్ లైన్ లో పంచామృతాభిషేకం సేవను నిర్వహించారు. అనంతరం శ్రీ మఠం ముందు భాగంలో ఏ పి జె ఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్, ఏపిజెయఫ్ మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షులు జయరాజు అద్వర్యంలో అభిమానులు శ్రీ రాఘవేంద్రస్వామి చిత్ర పటానికి పూలమాలవేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అనాథలకు, వృద్ధులకు పండ్లు,బెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాఘవలారెన్స్ ఛారిటబుల్ ట్రస్ట్ పేరు మీదుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఎందరో అనాధ పిల్లలకు ఉచితంగానే విద్య, పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్ లు చేస్తున్నారని కొనియాడారు. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు ఆదుకున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకొని తన వంతు సాహయం చేయడంలో రాఘవ లారెన్స్ ఎప్పుడు ముందుంటారని తెలిపారు. ఆయనకు డబ్బు ముఖ్యం కాదని సమాజ సేవ ముఖ్యము అని కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదోని లారెన్స్ అభిమానులు, ఈగల్ డాన్స్ మాస్టర్ చక్రి, ఆదోని అధ్యక్షుడు గణేష్ బసవరాజు, ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు రాజశేఖర్, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోటంరెడ్డి ని సత్కరించిన రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు చక్రధారి

నెల్లూరు అక్టోబరు 29, ( విభారె) నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ని శుక్రవారం రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు చక్రధారి పూల బొకే అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. నేను నా కార్యకర్త కార్యక్రమంలో భాగంగా నెల్లూరు గ్రామీణ నియోజవర్గ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్థానిక వేదాయపాలెం ప్రాంతంలో ఉన్న రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు చక్రధారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చక్రధారి ఎమ్మెల్యే కోటం రెడ్డి ని ఇంట్లోకి స్వాగతించి మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటం రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంచి మనసుతో ముందుకు వచ్చి, 29వ డివిజన్ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ షేక్ సత్తార్ ని అదే విధంగా 54 డివిజన్ లలో ఉన్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు చక్రధారి భరోసా ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా చక్రధారి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పద్మశాలి సంఘంకు సంబంధించి 10 మందికి మేలు చేసే, ఏ నిర్ణయం తీసుకున్నా, స్థానిక ఎమ్మెల్యేగా నా సంపూర్ణ మద్దత్తు ఉంటుందని హామీ ఇచ్చారు . త్వరలో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికలకు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దత్తు ఇస్తానని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు చక్రధారి పేర్కొన్నారు. ఈ క్రమంలో స్థానిక వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేర్నినానితో సినీ ప్రముఖులతో భేటీ

విజయవాడ, అక్టోబరు 29,(న్యూస్ పల్స్)ఆన్‌లైన్‌లో సినిమా టికెట్ల విక్రయానికి సినిమాటోగ్రఫీ చట్ట సవరణ చట్టానికి ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి గురువారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏపీ సచివాలయంలో మంత్రి పేర్ని నానితో సినీ నిర్మాతలు భేటీ అయ్యారు. మంత్రి పేర్ని నానిని నిర్మాతలు దిల్ రాజు, అలంకార్ ప్రసాద్ ఇతర నిర్మాతలు కలిసి పలు విషయాలపై మాట్లాడారు. సినీ రంగానికి సంబంధించిన పలు సమస్యలు, సినిమాటోగ్రఫీ చట్టం సవరణ, ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు పేర్కొంటున్నారు.కాగా.. ఆన్‌లైన్‌లో సినిమా టికెట్ల విక్రయానికి సంబంధించి గత కొన్ని రోజుల నుంచి టాలీవుడ్ నిర్మాతలు పలు అనుమానాలను వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే టాలీవుడ్ హీరో నాగర్జున.. గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో భేటీ అయి మాట్లాడారు. ఆయన సీఎం జగన్‌ను కలిసిన అనంతరం .. తాజాగా సినీ నిర్మాతలు మంత్రి పేర్ని నానితో భేటీ కావడం ప్రధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ నుంచి కొంత సమాచారం అడిగిందని.. అది ఇవ్వడానికే మంత్రిని కలిసినట్లు వెల్లడించారు. అందుకే కలిశామంటూ దిల్ రాజు మీడియా ప్రతినిధులతో పేర్కొన్నారు.

# బన్నీ ని తెగ వాడేస్తున్న కుర్ర హీరోలు..!




ప్రస్తుతం ఇండస్ట్రీలో ఎక్కడ చూసినా అల్లు అర్జున్ సందడే కనిపిస్తోంది. టాలీవుడ్ లో ఏ ఈవెంట్ ప్లాన్ జరిగినా దానికి చీఫ్ గెస్టుగా బన్నీ హాజరవుతున్నారు. అందుకే మీడియా సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా పుష్పరాజ్ హంగామా ఎక్కువగా కనిపిస్తోంది. ఈ మధ్య కాలంలో అల్లు అర్జున్ అనేక చిన్న మీడియం రేంజ్ సినిమాలకు తన వంతు సపోర్ట్ ఇస్తున్నారు. ప్రమోషనల్ కంటెంట్ తన చేతుల మీదుగా రిలీజ్ చేయడమే కాకుండా.. సినిమా ఫంక్షన్స్ కు కూడా అటెండ్ అవుతున్నారు.ఇటీవల అఖిల్ అక్కినేని నటించిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' సినిమా సక్సెస్ మీట్ కి అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ హోమ్ బ్యానర్ గీతా ఆర్ట్స్ లో రూపొందిన సినిమా కావడంతో గెస్టుగా వచ్చారని అందరూ అనుకున్నారు. అయితే లేటెస్టుగా నాగశౌర్య హీరోగా చేసిన 'వరుడు కావలెను' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో కూడా బన్నీ చీఫ్ గెస్ట్ గా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తనవంతు సాయంగా ఈ సినిమాకు కావాల్సినంత బజ్ ను క్రియేట్ తెచ్చిపెట్టాడు.ఇదే క్రమంలో ఇప్పుడు అల్లు అర్జున్.. యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ నటించిన కొత్త చిత్రం "పుష్పక విమానం" ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కు అతిథిగా హాజరు కానున్నారు. అక్టోబర్ 30న హైదరాబాద్ లో గ్రాండ్ గా జరగనున్న ఈ కార్యక్రమంలో బన్నీ ట్రైలర్ ను లాంచ్ చేస్తారని మేకర్స్ వెల్లడించారు. స్టార్ హీరో చేతుల మీదుగా ట్రైలర్ విడుదల అవుతుండటం పట్ల చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో టీమ్ అంతా కలిసి థాంక్యూ బన్నీ అన్నా అంటూ సెలబ్రేట్ చేసుకున్నారు.ఇలా అల్లు అర్జున్ ప్రస్తుతం చాలా సినిమాలకు అతిథిగా హాజరు కాబోతున్నారు. బన్నీ క్రేజ్ సినిమాకు ప్లస్ అవుతుందనే ఉద్దేశ్యంతో అందరూ చీఫ్ గెస్టుగా వచ్చి సపోర్ట్ చేయమని కోరుతున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్ కుర్ర హీరోలకు బన్నీ ఇమేజ్ బాగా కలిసొచ్చే అవకాశం ఉందని.. అందుకే అందరూ తెగ వాడేస్తున్నారని కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే అదే సమయంలో అల్లు అర్జున్ ఇలాంటి కార్యక్రమాలకు అటెండ్ అవుతూ తన సొంత సినిమా కంటే ఇతర హీరోల సినిమాలను ప్రమోట్ చేయడం వల్ల ఆయన ఇమేజ్ మరో స్థాయికి వెళ్తుందని అభిమానులు భావిస్తున్నారు.అంతేకాదు అల్లు అర్జున్ ఇలా మీడియాలో సోషల్ మీడియాలో సందడి చేయడం అంటే పరోక్షంగా 'పుష్ప' సినిమా ప్రమోషన్లు కూడా జరుగుతున్నట్టే అని కామెంట్స్ చేస్తున్నారు. ఏదేమైనా కరోనా కారణంగా కళ తప్పిన థియేటర్లన్నీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. బన్నీ లాంటి స్టార్ హీరో యంగ్ హీరోల సినిమా ప్రమోషన్స్ లో భాగం అయితే ఎక్కువ మంది జనాలను థియేటర్లకు వచ్చే అవకాశం ఉంటుంది. దీని వల్ల తెర మీద తెర వెనుక కష్టపడే ప్రతి ఒక్కరికీ లాభం చేకూరుస్తుందని చెప్పవచ్చు.ఇక "పుష్పక విమానం" సినిమా విషయానికొస్తే.. 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సూపర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ తమ్ముడు నటిస్తున్న మూవీ ఇది. నవంబర్ 12న థియేటర్లలోకి రాబోతోంది. సురేష్ ప్రొడక్షన్స్ – గ్లోబల్ సినిమాస్ – ఫ్రీజ్ ఫ్రేమ్ ఫిలింస్ సంస్థలు ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి. నూతన దర్శకుడు దామోదర ఈ సినిమాని తెరకెక్కించారు. విజయ్ దేవరకొండ సమర్పణలో కింగ్ అఫ్ ది హిల్ ఎంటర్ టైన్మెంట్స్ మరియు టాంగా ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ మూవీని నిర్మించాయి. గోవర్ధన్ రావు దేవరకొండ – విజయ్ మట్టపల్లి – ప్రదీప్ ఎర్రబెల్లి లు దీనికి నిర్మాతలు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు – పాటలు మంచి స్పందన తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో అల్లు అర్జున్ చేతులు మీదుగా రిలీజ్ చేయబడుతున్న "పుష్పక విమానం" ట్రైలర్ ఎలా ఉంటుందో చూడాలి.

# పవన్ సరసన కొత్తమ్మాయ్.. డైరెక్టర్ రికమండేషన్?

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. హరిహర వీరమల్లు- భీమ్లా నాయక్ చిత్రీకరణలు పూర్తి చేస్తున్నారు. తదుపరి హరీష్ శంకర్.. సురేందర్ రెడ్డిలతో సినిమాలు చేయనున్నాడు. ఇప్పటికే సురేందర్ రెడ్డి డైరెక్షన్ లో పవన్ కళ్యాణ్ ఓ సినిమాకి సైన్ చేయబోతున్నట్లు సమాచారం. ప్రస్తుత సినిమాలను పూర్తి చేశాక హరీష్ తో పవన్ 28వ సినిమా ఉంటుంది. సైమల్టేనియస్ గానే సూరితో పవన్ జాయినవుతారు. సూరితో పవన్ కెరీర్ 29వ సినిమా ఇది. పీఎస్ పీకే 29 టైటిల్ తో ఈ చిత్రాన్ని ప్రారంభించే ముందు తన రాజకీయ కమిట్ మెంట్లను



పవన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.ఈలోగానే సురేందర్ రెడ్డి ప్రీప్రొడక్షన్ ని వేగంగా పూర్తి చేసి కథానాయికను ఇతర కాస్టింగ్ ని ఫైనల్ చేసే పనిలో ఉన్నారట. తాజా సమాచారం మేరకు కథానాయికగా ముంబై బ్యూటీ సాక్షి వైద్యను ఎంపిక చేసేందుకు దర్శకనిర్మాతలు ఆసక్తిగా ఉన్నారని తెలిసింది. అధికారిక ధృవీకరణ లేనప్పటికీ మేకర్స్ కాస్టింగ్ ఎంపికలు.. ఇతర ప్రీ-ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్నారని కథానాయికను ఒకే చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. సాక్షి తెలుగులో హీరో అఖిల్ అక్కినేని సరసన ఏజెంట్ లో నటిస్తోంది. థ్రిల్లర్ కాన్సెప్టుతో రూపొందుతున్న ఈ చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకుడు. సాక్షి పని తీరు సూరికి నచ్చి పవన్ కోసం రికమండ్ చేశారట. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భవదీయుడు భగత్ సింగ్' చిత్రీకరణను పూర్తి చేసిన తర్వాత ఖూఖఖ29 సెట్స్లోకి వెళుతుంది.భీమ్లా నాయక్ .. హరిహర వీరమల్లు చిత్రాల్లోనూ పవన్ సరసన పలువురు టాప్ హీరోయిన్లు నటిస్తున్న సంగతి తెలిసిందే. నిత్యా మీనన్.. నిధి అగర్వాల్ లాంటి అందాల నాయికలు పవన్ సరసన నటిస్తున్నారు. ఇప్పుడు హరీష్ తన ఫేవరెట్ పూజా హెగ్డేని లాక్ చేయగా.. సురేందర్ రెడ్డి కొత్త కథానాయిక సాక్షి వైద్యను ఎంపిక చేసుకున్నారు.

# రెండు దశాబ్దాల ఎదురు చూపులకు తెర

కొన్ని కాంబినేషన్ ల్లో సినిమాల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. ఆ కాంబోలో సినిమా ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న సమయంలో ఆ సినిమా ప్రకటన వస్తే అభిమానుల ఆనందంకు అవధులు ఉండవు. ఖలేజా తర్వాత మహేష్ బాబు.. త్రివిక్రమ్ ల కాంబోలో సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా అంటూ అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు మహేష్ త్రివిక్రమ్ ల మూవీ అధికారిక ప్రకటన వచ్చింది. ఆ ప్రకటన వచ్చిన సమయంలో అభిమానుల ఆనందంకు అవధులు లేవు అనడంలో సందేహం లేదు. ఇప్పుడు ఇదే తరహా ఆనందంను తమిళ



సినీ ప్రేమికులు పొందుతున్నారు. తమిళ స్టార్ హీరో సూర్య మరియు ప్రముఖ దర్శకుడు బాలా కాంబినేషన్ లో సినిమా అధికారిక ప్రకటన వచ్చింది. 2001 సంవత్సరంలో వీరిద్దరి కాంబోలో నంద సినిమా వచ్చింది. ఆ సినిమా మంచి టాక్ ను దక్కించుకుని సూర్యకు నటుడిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. ఆ సమయంలోనే సూర్యకు తమిళంలో గుర్తింపు లభించింది. ఆ తర్వాత రెండేళ్లకు పితామగన్ ను బాలా దర్శకత్వంలో సూర్య చేయడం జరిగింది. ఆ సినిమా తో తెలుగు ప్రేక్షకులకు సూర్య మరింత చేరువ అయ్యాడు. అలా తన కెరీర్ లో చాలా కీలకమైన రెండు సినిమా లను బాలా దర్శకత్వం లో చేసిన సూర్య దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన దర్శకత్వంలో చేయలేదు. వీరిద్దరి కాంబో సినిమా కోసం అభిమానులు సుదీర్ఘ కాలంగా వెయిట్ చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రేక్షకులు మరియు అభిమానులు కోరుకున్న సినిమా అధికారిక ప్రకటన వచ్చేసింది.త్వరలో సూర్య హీరోగా బాలా దర్శకత్వంలో ఒక సినిమా పట్టాలెక్కబోతుంది. ఆ సినిమా ను స్వయంగా సూర్య తన సొంత నిర్మాణ సంస్థ లోనే నిర్మించబోతున్నాడు. సినిమా ఎలా ఉంటుంది.. ఎప్పుడు ఉంటుంది అనే విషయాలపై క్లారిటీ లేదు.. కాని తన తండ్రి మరియు బాలా తో కలిసి సూర్య దిగిన ఫొటోను షేర్ చేసి సినిమా పై జనాల్లో ఆసక్తి పెంచాడు. ఇన్నాళ్ల తర్వాత బాలా దర్శకత్వం లో సినిమా ను చేయబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది అంటూ సోషల్ మీడియా ద్వారా షేర్ చేశాడు. నాన్న గారి ఆశీస్సులతో ఈ సినిమా ను పట్టాలెక్కించబోతున్నాం అంటూ సూర్య ట్వీట్ చేశాడు. అతి త్వరలోనే ఈ సినిమా కు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తానంటూ సూర్య ప్రకటించడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా రెండు దశాబ్దాలుగా ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్నాం.. ఇప్పటికి అయినా ఇస్తున్నందుక కృతజ్ఞతలు అంటూ బాలా మరియు సూర్యలకు అభిమానులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

# క్వార్టర్ ఫైనల్ కు పీవీ సింధు



ముంబై, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)టోక్యో ఒలింపిక్స్-2020లో పతకం సాధించి తొలి టైటిల్‌పై కన్నేసి ఓడిన భారత స్టార్ మహిళా బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు.. పారిస్ వేదికగా జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో రెండో రౌండ్‌లో డెన్మార్క్‌కు చెందిన లైన్ క్రిస్టోఫర్సన్‌ను వరుస గేమ్‌లలో ఓడించి సింధు క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం చివర్లో జరిగిన మ్యాచ్‌లో మూడో సీడ్ సింధు 21-19, 21-9తో ప్రపంచ 24వ ర్యాంకర్ క్రిస్టోఫర్‌సన్‌ను ఓడించింది. ఈ మ్యాచ్ 37 నిమిషాల పాటు సాగింది.ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ సింధు క్వార్టర్స్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన ఎనిమిదో సీడ్ బుసానన్ ఒంగ్‌బమ్రుంగ్‌ఫాన్‌తో తలపడనుంది. గత వారం డెన్మార్క్ ఓపెన్‌లో బుసానన్‌ను ఓడించింది. పురుషుల డబుల్స్ జోడీ ఐదో సీడ్ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ కూడా 15-21, 21-10, 21-19తో స్వదేశానికి చెందిన ఎంఆర్ అర్జున్-ధృవ్ కపిలను ఓడించి క్వార్టర్‌ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. భారత జోడీ ఇప్పుడు నాలుగో సీడ్ మలేషియా జోడీ ఆరోన్ చియా, సోహ్ వూయ్ యిక్‌తో తలపడనుంది.

పురుషుల సింగిల్స్..పురుషుల సింగిల్స్ విభాగంలో మాత్రం భారత్‌కు నిరాశే ఎదురైంది. ఈ విభాగంలో సౌరభ్ వర్మ రెండో రౌండ్‌లో జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటో చేతిలో 12-21, 9-21 తేడాతో ఓడి పోటీ నుంచి నిష్క్రమించాడు. యువ ఆటగాడు లక్ష్య సేన్ గురువారం సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూపై సులభంగా విజయం సాధించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు.డెన్మార్క్ ఓపెన్‌లో..భారత్ తరపున రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన తొలి మహిళా క్రీడాకారిణి సింధు. టోక్యో ఒలింపిక్స్-2021లో కాంస్య పతకాన్ని సాధించింది. గతంలో రియో ??ఒలింపిక్స్-2016లో రజత పతకం సాధించింది. టోక్యో ఒలింపిక్స్ తర్వాత సింధు డెన్మార్క్ ఓపెన్ నుంచి పునరాగమనం చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**